మార్చిలోగా ఐదు వేల పంట కుంటలు

- ఉపాధి హామీ పథకం ద్వారా తవ్వకం
- ఈసారి కమ్యూనిటీ స్థలాల్లో కూడా అనుమతి
- మండలాల వారీ లక్ష్యాలపై పీడీ టెలీకాన్ఫరెన్స్

ఒంగోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణకు ఉపాధి హామీ పథకంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తుండగా మరోసారి పెద్దఎత్తున పంట కుంటలు(ఫాంపాడ్లు) తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఏడాది మార్చిలోగా జిల్లాల వారీగా తవ్వకం చేయాల్సిన పంట కుంటల లక్ష్యాలను నిర్దేశించింది. అందులో భాగంగా జిల్లాలో ఐదువేల కుంటలను మార్చి ఆఖరులోగా తవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. తదనుగణ చర్యలపై డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ బుధవారం మండల స్థాయిలోని అధికారులు, సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఉపాధి కూలీల ద్వారా ఈ కుంటలు తవ్వాల్సి ఉంది. గతేడాది కూడా రైతుల పొలాల్లో పంట కుంటల తవ్వకాలపై ప్రభుత్వం దృష్టిసారించినా ఆశించిన స్థాయిలో అవి చేపట్టలేదు. అప్పట్లో వేసవిలో ఈ పనులు చేపట్టడం, జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో భూమి గట్టిగా లేదా కొన్నిచోట్ల రాతినేల ఉండటంతో కూలీలు తవ్వేందుకు ముందుకు రాలేదు. దీంతో జిల్లాలో 1700 కుంటలు మాత్రమే తవ్వారు. అయితే సాగు విధానంలో పలు సంస్కరణలు తెచ్చే ప్రయత్నంలో ఉన్న పంచసూత్రాల పేరుతో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన విషయం విదితమే. అందులో నీటి భద్రత ప్రథమ అంశం కాగా మెట్ట ప్రాంతాల్లో పంట కుంటలు అందుకు ఉపకరించనున్నాయి. దీంతో వాటిపై సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పంట కుంటల తవ్వకాలను సంక్రాంతి అనంతరం చేపట్టాలని నిర్ణయించారు.

సంక్రాంతి తర్వాత చేపట్టాలి

సాధారణంగా ఉపాధి కూలీలు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు అలాగే సంక్రాంతి అనంతరం మార్చి వరకు వస్తుంటారు. అలా సంక్రాంతి తర్వాత రెండవ విడతగా పనులు చేపట్టే సమయంలో పంట కుంటల తవ్వకాలపై దృష్టిసారించాలని డ్వామా జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఆలోపు గ్రామ, మండలాల వారీగా లక్ష్యాలు రూపొందించడం, ఏ రైతు పొలంలో తవ్వాలన్నది గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం, పంట కుంటల తవ్వకాలకు సంక్రాంతిలోపే మంజూరు ఉత్తర్వులు ఇవ్వడం పూర్తిచేసి సంక్రాంతి అనంతరం పనులు చేపట్టాలని ఆదేశించారు. గతంలో రైతు పొలంలో మాత్రమే ఈ కుంటల తవ్వకాలు చేపట్టగా ఈసారి కమ్యూనిటీ కుంటల తవ్వకాలకు కూడా అవకాశం ఇచ్చారు. అంటే గ్రామాల్లో ఉమ్మడి భూమి లేదా కొన్ని కుటుంబాలకు చెందిన ఉమ్మడి భూములు ఉన్నచోట కూడా కుంటలు తవ్వనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలాలు, గ్రామాల వారీ పంట కుంటల తవ్వకాలపై సిబ్బందితో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఆ శాఖ ద్వారా జరుగుతున్న ప్లాంటేషన్, ఇతర అంశాలపై సమీక్ష చేశారు.

బోగస్ గ్రూపుల బాగోతంపై ఇంటెలిజెన్స్ ఆరా

- మరోవైపు కొనసాగుతున్న రెండు కమిటీల విచారణ
- అవినీతి ఆర్పీలకు అండగా నిలుస్తున్న కొందరు సీవోలు
- అవకతవకలను దాచిపెట్టేందుకు మల్లగుల్లాలు
- గగ్గోలుపెడుతున్న బాధిత పొదుపు మహిళలు



మెప్మాపై నిఘా

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపులతో పొదుపు మహిళలను మోసం చేసిన వ్యవహారంపై ఇంటెలిజెన్స్ విభాగం దృష్టిసారించింది. ఈ మేరకు ఒంగోలు మెప్మా ద్వారా అందుతున్న సేవలు, పొదుపు సభ్యులకు అందిస్తున్న రుణాలపైనా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మెప్మా హెడ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో విచారణ ప్రారంభం కాగా, కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ జి.గోపాలకృష్ణ చైర్మన్‌గా కూడా విచారణ సాగుతోంది. దీంతో అవినీతికి పాల్పడిన ఆర్పీలు, అందులో భాగస్వాములైన సీవోలు, బ్యాంకు లింకేజి అధికారులతోపాటు, ఉద్యోగులు వణికిపోతున్నారు.

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో అక్రమాల డొంక కదులుతోంది. బోగస్ గ్రూపులతో రుణాలను స్వాహా చేసిన వ్యవహారంపై విచారణ కొనసాగుతుండగా, దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. గత వారం రోజులుగా మెప్మాలో సాధారణ విధులు వదిలేసి, బోగస్ గ్రూపుల జాబితా సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆంధ్రజ్యోతి ప్రచురించిన వరుస కథనాలతో అవినీతి ఆర్పీలు వణికిపోతుండగా, అందుకు సహకరించిన అధికారులు, సిబ్బంది ఆ తప్పులు నుంచి తప్పించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే కోట్ల రూపాయల అవినీతి బాగోతంపై వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఇంటెలిజెన్స్ అధికారులు అంతర్గతంగా విచారణ మొదలుపెట్టినట్లు సమాచారం.

బోగస్‌ను దాచిపెట్టేందుకు మల్లగుల్లాలు

2022 నుంచి 2025 వరకు పొదుపు సభ్యులకు మంజూరైన ఏయే బ్యాంకుల్లో ఎంత రుణం ఇచ్చారనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు బ్యాంకర్ల పాత్రపైనా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంత సమాచారాన్ని సేకరించిన ఇంటెలిజెన్స్ అధికారులు, క్షేత్రస్థాయి నుంచి లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం వరకు తమకేమీ కాదన్నట్లుగా ధీమాగా ఉన్న అవినీతి ఆర్పీలు, సీవోలు, బ్యాంకు లింకేజి అధికారులు.. మెప్మాపై ఇంటెలిజెన్స్ ఆరా, జేసీ విచారణ, మెప్మా ఎండీ విచారణలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

అవినీతి ఆర్పీకి అండగా సీవోలు

తాజాగా వెలుగులోకి వచ్చిన కేశవస్వామిపేటలోని యానాది సామాజికవర్గానికి చెందిన కొందరు పొదుపు సభ్యులు తమ సంఘాల బాధ్యతలు చూసే ఆర్పీ తమకు తెలియకుండా భారీగా దోచుకుందని, దీంతో బ్యాంకుల నుంచి తమకు నోటీసులు అందాయని పీడీకి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే మెప్మా హెడ్ ఆఫీస్ నుంచి ఐదుగురు సభ్యులు విచారణ చేశారు. అటు ఆర్పీని, ఇటు పొదుపు సభ్యులను విచారించగా, అవినీతి వాస్తవమే అని గుర్తించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా హెడ్ ఆఫీస్ విచారణ కమిటీ ఆదేశాలతో శని, ఆదివారాలలో మరోసారి విచారణ చేశారు. ఈ విచారణలో ఒక్కో సీవోకి మూడు గ్రూపుల బాధ్యతలు అప్పగించి లోతుగా విచారణ చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో ఒంగోలులోని దేవుడుచెరువు పార్కులో జరిగిన విచారణలో ఓ ముగ్గురు సీవోలు అవినీతికి పాల్పడిన ఆర్పీకి అండగా నిలిచినట్లు తెలుస్తోంది. అవినీతి జరిగిందని ఒకవైపు సభ్యులు మొర పెట్టుకుంటున్నప్పటికీ, అలాంటిదేమీ లేదన్నట్లుగా సీవోలు ఆ ఆర్పీకి తమ అండదండలు అందిస్తున్నట్లు తెలిసింది. ఇదేసమయంలో ఆ ముగ్గురు సీవోలకు ఆర్పీ సకల మర్యాదలు అందించడంతోపాటు, తనకు సహకరిస్తే అన్నీ తాను చూసుకుంటానని తెలిపినట్లుగా కొందరు సభ్యులు వెల్లడిస్తున్నారు.

అవినీతిని ప్రశ్నించిన సభ్యులపై ఆర్పీ దౌర్జన్యం

ఒంగోలు మెప్మాలో జరిగిన అవినీతి వ్యవహారంలో ఇప్పటికే పేర్నమిట్టకు చెందిన ఓ ఆర్పీపై అక్కడి సభ్యులు ఫిర్యాదు చేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము రోజువారీ కూలి పనులకు వెళతామని, అయితే రుణాలు ఇప్పిస్తామని చెప్పిన ఆర్పీ తమకు తెలియకుండా కోట్ల రూపాయల రుణాలు తీసుకుని మింగేసిందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు బ్యాంకుల నుంచి తమకు నోటీసులు అందుతున్నాయని వాపోతున్నారు. ఇదేవిషయమై బాధ్యురాలైన ఆర్పీని ప్రశ్నిస్తే తమపై భౌతిక దాడులకు దిగినట్లు చెబుతున్నారు. అయితే ఆ ఆర్పీపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా, కేవలం లాగిన్ నిలిపివేయడంతోనే సరిపెట్టారని, రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద వసూలు చేయకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టెన్త్ పరీక్షల ఫీజు దోపిడీ



- అక్రమ వసూళ్లు అరకోటిపైనే
- చెల్లించాల్సిన ఫీజు రూ.125
- స్కూళ్లు వసూలు చేస్తోంది రూ.500 నుంచి రూ.2,500

ఒంగోలు విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు దందా నడుస్తోంది. పరీక్ష ఫీజు వసూళ్ల ద్వారా మొత్తం యాజమాన్యాలు రూ.అరకోటిపైనే ఆర్జించాయన్న ఆరోపణలు వచ్చాయి. వాస్తవంగా విద్యార్థులు చెల్లించాల్సింది రూ.125 కాగా కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పరీక్ష ఫీజు పేరుతో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.వెయ్యి నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నారు. జిల్లాలో వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షలకు 29,117 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో ప్రభుత్వ, ప్రభుత్వరంగ పాఠశాలల్లో చదువుతున్న వారు 17,380 మంది కాగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న వారు 11,737 మంది ఉన్నారు.

అక్రమ వసూళ్లు

ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల వివరాల ప్రకారం రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ అయితే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష ఫీజుకు అదనంగా రూ.60, వయస్సు కాండనేషన్‌కు రూ.300 చెల్లించాల్సి ఉంది. అయితే ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారీతిన వేలకు వేలు వసూలు చేస్తున్నారు.

అధికంగా వసూళ్లు చేస్తే చర్యలు

పదవ తరగతి పరీక్ష ఫీజు పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కే.శ్రీనివాసులరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అధిక ఫీజులు వసూలు చేసినట్లు రుజువైతే ఆయా పాఠశాలకు భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందువల్ల వసూళ్ళపై తల్లిదండ్రులు మండల విద్యాధికారులు, ఉపవిద్యాధికారులు, డీఈవో, ఆర్‌జేడీలకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

అధికారులకు హైస్కూళ్ల దత్తత

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టేందుకు వివిధ శాఖల జిల్లా అధికారులను కూడా రంగంలోకి దింపుతుంది. అందులో భాగంగా ప్రభుత్వ జిల్లా అధికారులకు పదవ తరగతి విద్యార్థులు ఉన్న హైస్కూళ్లను దత్తత ఇవ్వనుంది. విద్యార్థుల కోసం అధికారులు ఈనెల 6 నుంచి 100 రోజుల అకడమిక్ ప్రణాళికను అమలు చేయనున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు జిల్లా అధికారులను నియమించనున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణకు వస్తున్నారంటే ఉపాధ్యాయులు కూడా మరింత బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేస్తారు కనుక మంచి ఫలితాలు రాబట్టవచ్చన్నది విద్యాశాఖ అధికారుల ఆలోచన. పదవ తరగతి విద్యార్థుల సిలబస్ ఈనెల 5 నాటికి పూర్తి చేయాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశించారు. 6వ తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక ప్రారంభం కానుంది. యూడైస్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లకు బదులుగా ఉపాధ్యాయుల ఫోన్ నెంబర్లు ఇస్తే సంబంధిత టీచర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు.

ధాన్యం కొంటున్నారు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దర్శి మండలంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. 'అగమ్యగోచరం' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. సివిల్‌సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో సామంతపూడిలో జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాజంపల్లి, లంకోజనపల్లి, బొట్లపాలెం గ్రామాల్లో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

జిల్లాలో 43 కేంద్రాలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సహకారశాఖ ఆధ్వర్యంలో 43 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు సహకారశాఖ అధికారి దేవిరెడ్డి శ్రీలక్ష్మీ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) ద్వారా 31 కేంద్రాలు, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ద్వారా 9 కేంద్రాలు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ద్వారా మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు నగరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు తగిన ప్రోత్సాహం అందించి వారు అన్నిరంగాల్లో రాణించేందుకు తోడ్పాటు అందించటంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తామని కలెక్టర్ రాజాబాబు అన్నారు. అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశం హాలులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కలుగజేస్తామని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నిప్రభుత్వ శాఖల్లో విభిన్నప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు కల్పిస్తామన్నారు. దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

బైకులు దొంగిలించి జల్సా

- చోరీ చేసిన బండ్లు అమ్మకం
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- 11 వాహనాలు స్వాధీనం

పుల్లలచెరువు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసలై జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు బైకులు దొంగిలించి అమ్ముకుంటూ పోలీసులకు చిక్కారు. పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు వెల్లడించారు. గతనెల 29వ తేదీన పుల్లలచెరువు మండలం పాతచెరువు తండాకు చెందిన లక్మానాయక్ తన బైకును బస్టాండ్‌లో నిలిపి ఉంచగా అపహరించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై సంపత్‌కుమార్, ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలు చూసి సాంకేతికత ఆధారంగా వివిధ కోణాల్లో పరిశీలించిన మీదట నిందితుల సమాచారం తెలుసుకున్నామన్నారు. ముటుకుల వద్ద పల్నాడు జిల్లా గణేశుపాలెం గ్రామానికి చెందిన చొప్పరపు వేణు, చొప్పరపు సన్నీ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. సోషల్ మీడియాలో బైక్ తాళాలు తీయటం ఎలాగో తెలుసుకుని హ్యాండిల్‌లాక్ వేయని వాటిని దొంగిలించి అమ్ముకుంటున్నట్టు వారి ద్వారా సమాచారం రాబట్టారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసులలో వివరాల ప్రకారం మొత్తం 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైతో పాటు సిబ్బంది అరుణ్, రమేష్, వీరాంజనేయులు, కాశీ, సత్యనారాయణ తదితరులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

బీపీఎస్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

- మునిసిపల్ టౌన్ ప్లానింగ్ ఆర్డీ మధుకుమార్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ సూచించారు. బుధవారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో బీపీఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నగర కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆర్డీ మధు కుమార్ మాట్లాడుతూ మునిసిపాలిటీల పరిధిలో నిబంధనలు అతిక్రమించి కట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఐదేళ్ల తర్వాత అవకాశం వచ్చిందన్నారు. దీనిని ప్రతి యజమానీ సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించాలని తెలిపారు. లైసెన్స్ బిల్డింగ్ ఇంజనీర్లు, ఎల్టీపీలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీ మధుకుమార్

సాగరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

త్రిపురాంతకం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ సాగరు కాలువలో జారిపడి విద్యార్థి గల్లంతైన ఘటన బుధవారం జరిగింది. రాజుపాలెం గ్రామానికి చెందిన పెద్దపూడి సురేంద్రరెడ్డి అనే యువకుడు ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కాలువ వద్ద పరిశీలించగా గట్టుపై చెప్పులు ఉన్నట్టు గుర్తించి కాలువలో జారిపడినట్టు భావించారు. వెంటనే యువకుని ఆచూకీ కోసం పోలీసుల ఆధ్వర్యంలో ఈతగాళ్లు, స్థానికులు గాలించటం ప్రారంభించారు. సాయంత్రం వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. కలెక్టర్‌కు ఎన్డీఆర్ఎఫ్ బృందాల కోసం లేఖ పంపామని వారి ఆధ్వర్యంలో గురువారం కూడా గాలింపు కొనసాగుతుందని ఎస్సై శివబసవరాజు తెలిపారు. గురువారం మధ్యాహ్నానికి ఆచూకీ లభించవచ్చని భావిస్తున్నామని ఆయన చెప్పారు. వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న సురేంద్రరెడ్డి బంధువుల ఇరుముడి కార్యక్రమం ఉందని ఇంటికి వచ్చినట్టు తెలిసింది.



సురేంద్రరెడ్డి (ఫైల్)

14 ఆలయాలకు నిధులు మంజూరు

● సీఎం చంద్రబాబుకు మంత్రి స్వామి కృతజ్ఞతలు

తూర్పునాయుడుపాలెం (కొండపి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజవకర్గంలోని 14ఆలయాల పునరుద్ధరణ పనుల కోసం సర్వశ్రేయోనిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి అధికారిక సమాచారం అందించారు. టంగుటూరు మండలంలోని జమ్ములపాలెంలోని అనంత కోదండ రామస్వామి ఆలయానికి రూ.1.33కోట్లు, సూరారెడ్డిపాలెంలోని అనంత కోదండరామస్వామి ఆలయానికి రూ.1.33కోట్లు, తూర్పునాయుడుపాలెంలోని కోదండరామస్వామి ఆలయానికి రూ.33.33లక్షలు, కాకుటూరివారిపాలెంలోని సీతారామస్వామి ఆలయానికి రూ.50 లక్షలు, పొన్నలూరు మండలం చెన్నిపాడు వద్ద ప్రసిద్ధి చెందిన సంగమేశ్వర ఆలయానికి రూ.2.36 కోట్లు, వేంపాడులోని రామాలయానికి రూ.33.33 లక్షలు, రావులకొల్లులోని పోలేరమ్మ ఆలయానికి రూ.50లక్షలు, వెంకుపాలెంలోని కోదండరామస్వామి ఆలయానికి రూ.33.33లక్షలు, పొన్నలూరులోని భీమేశ్వరస్వామి ఆలయానికి రూ. 53.33 లక్షలు, సింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని పోలేరమ్మ తల్లి ఆలయానికి రూ.33.33లక్షలు, మర్రిపూడిలోని ముత్యాలమ్మవారి ఆలయానికి రూ.86.67 లక్షలు, ఇదే మండలం తంగెళ్లలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.66.67లక్షలు, జంగాలపల్లెలోని రామాలయానికి రూ.20 లక్షలు, జరుగుమల్లి మండలం పచ్చవలోని అన్నపూర్ణా సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు, దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి మంత్రి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 21వ డివిజన్‌లోని ఎన్జీవో హోమ్ సమీపంలోని ఓ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి అక్కడి ప్రజలు నడిచేందుకు వీలుగా ఆరు అడుగుల రోడ్డును నెల రోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం అక్కడి ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే ఎన్జీవోహోమ్ సమీపంలో పర్యటించారు. కొన్ని గృహాల వారికి నడవడానికి వీలు లేకుండా ఉందని, ఆక్రమణలు ఉన్నాయని పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన దామచర్ల, స్వయంగా అక్కడకు చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం దారి నిర్మించాలని, అవసరం అయితే ఆక్రమణలు తొలగించి నష్టపరిహారంగా టీడీఆర్ బాండ్‌ల రూపంలో లబ్ధి చేకూర్చాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనరు కె. వెంకటేశ్వరరావు, టీడీపీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నూతన పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి

● కలెక్టర్ రాజాబాబు
● పలు గ్రామాల్లో 'రైతన్నా మీకోసం'



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మద్దిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు నూతన పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని చేయాలని, దానివల్ల మంచి లాభాలు వస్తాయని, ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు కోరారు. బుధవారం రైతన్నా మీకోసంలో భాగంగా మద్దిపాడు మండలం దొడ్డవరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు అవసరమైన గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు సాగులో నూతన పరిజ్ఞానాన్ని రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందన్నారు. వినూత్న విధానాలతో రాబడి పెంచుకునేలా రైతులు ముందుకు రావాలని, ఆయా విషయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి ప్రత్యేక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగులో అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, భూమిరకం, వాతావరణ పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలపై వారు వివరిస్తారని చెప్పారు. ముందుగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని టీవీల్లో వీక్షించారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాసరావు, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మలజ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో జి.స్వర్ణలత, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆత్మ పీడీ మంజుల పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో జి.స్వర్ణలత, ఏఈ శేషయ్య, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ కిషోర్, ఆత్మ బీటీఎం కృష్ణ, శేషారావు, ఎంపీఈవో లక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షులు అయ్యన్న పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులో బుధవారం టీవీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో ఏవో పావని, జిల్లా వనరులకేంద్రం అధికారి వీవీ.శేషమ్మ, విస్తరణాధికారి కేవీ.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఏవో రమేష్‌బాబు అన్నారు. ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని టీవీల్లో వీక్షించారు. కార్యక్రమంలో మండవవారిపాలెం సర్పంచ్, మండవ వెంకటసుబ్బయ్య, మండవ శ్రీనివాసరావు, కొప్పోలులో పాటిబంట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బండ్లమూడిలో..

చీమకుర్తి: రైతన్నా మీకోసం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం బండ్లమూడిలో గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో భాస్కర్ పాల్గొని సీఎం ప్రసంగాన్ని రైతులకు వినిపించారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. చెన్నుపాడులో ఏవో రాము మాట్లాడుతూ గ్రామాల వారీగా, పంటల వారీగా తలసరి ఆదాయం పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శివరామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ అధికారి మందాకిని, నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్‌బాబు, వెంకట్రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో జలరక్ష మాసం



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్, మేయర్, సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జలరక్ష మాసం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత, కమిషనరు వెంకటేశ్వరరావు, ఎండీ ఏసయ్య నగరంలోని తాగునీటి సరఫరా కేంద్రాలను, అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ప్రతి నెలా నగర పరిధిలోని 22 ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేసి, రికార్డు చేస్తామన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రజలందరీక స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో దివ్యాంగుల దినోత్సవం



చిన్నారులతో జీజీహెచ్ వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఒంగోలులోని జీజీహెచ్‌లోని బాలభవిత కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీజీహెచ్‌లోని డీఈఐసీ ఆధ్వర్యంలో ఎంతో మంది చిన్నారులకు ఉజ్వల భవిష్యత్ అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే చిన్నారులు పూర్తి స్థాయిలో నడిచేలా అవసరమైన వైద్యసేవలను అందిస్తున్నట్లు చెప్పారు. పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రీతం, డాక్టర్ జయ, విద్య, వైష్ణవి, అనీల్, రాజా, రాము పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు బొమ్మలు గీయడం, పరుగుపందెం, నృత్యం పోటీలను నిర్వహించారు. ఎంఈవో వెంకారెడ్డి, స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విక్టర్ పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తన్నీరుశ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్యపరీక్షలు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 3: ఒంగోలులోని రిమ్స్ పక్కన ఉన్న సుధ దంత వైద్యశాలలో గురువారం ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఓపీతో దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కవర్తపు అవినాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మొదటి గురువారం ప్రజలకు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి చేయూత

చీమకుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి మెప్మా చేయూత ఇస్తోందని పీడీ శ్రీహరి తెలిపారు. బుధవారం చీమకుర్తిలోని మెప్మా కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలతోపాటు దివ్యాంగులకు రుణసదుపాయం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని 8 దివ్యాంగుల సంఘాలకు రూ.38లక్షల రుణ చెక్కులను అందజేశారు. వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్ గోరంట్ల అంజలి, సొసైటీ అధ్యక్షులు పూనాటి వెంకట్రావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, శిద్దా సుధాకర్, గొల్లపూడి సుబ్బారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, తాతినేని రాము, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు రఫీ, వెంకట్రావు, మెప్మా సీఎంఎం రూపలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ మొదటి రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ 141వ జయంతి వేడుకలు బుధవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రపతిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధురశ్రీ, బంతికట్ల నాగేశ్వరరావు, కె.కృష్ణవేణి, టి.గోవిందమ్మ, ఎస్.అనిల్ బాబు, మృదుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులపై దృష్టి సారించాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి వనరులపై దృష్టి సారించాలని ఎంపీడీవో రవికుమార్ ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అత్యవసర సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి వనరులు, పథకాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఈనెల 5న మెగా పేరెంట్స్ సమావేశాల సందర్భంగా స్కూళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏవో దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్) గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాను సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు ఆదేశించారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడతూ గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన తరువాతే మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఇంటిపన్నులు నూరు శాతం వసూలు చేయాలని చెప్పారు. స్వామిత్వ సర్వేను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ చట్ట సవరణ చేయాలి : ఎంపీ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ బిల్ అండ్ సివిల్ డిఫెన్స్ యాక్టు సవరణను వెంటనే చేసేలా చర్యలు తీసుకోవాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. 377 కింద మోడల్ హోంగార్డ్స్ బిల్ 1965, సివిల్ డిఫెన్స్ యాక్టు/రూల్స్ పునఃసమీక్షపై బుధవారం పార్లమెంట్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో హోంగార్డ్స్, సివిల్ డిఫెన్స్ సంస్థలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని తెలిపారు. ఆపద కాలంలోనూ, దేశ అంతర్గత, సంఘ భద్రతలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ వీరి ప్రాధాన్యత అధికంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టబద్ధతమైన బిల్లు పాతబడిందని, అందువల్ల దానిని సవరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే విధానం ఉండేలా ఈ బిల్లుపై ప్రత్యేక దృష్టిసారించి త్వరగా పూర్తిచేసి చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు.

క్విస్‌లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి వికసిత్‌భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు సహకారంతో ఈ రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రిదేవి తెలిపారు. ఈ శిబిరంలో 70 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.హనుమంరావు, హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్స్ హెడ్స్ శ్రీకాంత్, రేగుల గిరిబాబు, మండవ రాధారాణి, జాజుల మల్లికార్జున, బ్యాంకు, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

6న అంబేడ్కర్ వర్ధంతి సభ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎన్జీవో భవన్‌లో ఈనెల 6వ తేదీన జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కె.సుజన్ మాదిగ కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ వర్ధంతి సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రజాసేవలో విశిష్ట సేవలు చేసిన వారికి సామాజిక పరివర్తన అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. అనంతరం పేద మహిళలు, వితంతువులకు చీరలు పంపిణీ చేస్తామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో త్యాగరాజు, కె.విజయకుమార్, తేళ్ళ జయరాజ్, బండారు సురేష్, నారాయణ, అప్పారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

6న మెగా రక్తదాన శిబిరం

నాగులుప్పలపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి మహా పరినిర్వాణ్ దివాస్ సందర్భంగా ఈ నెల 6న నాగులుప్పలపాడు మండల పరిషత్‌కార్యాలయం వద్ద ఒంగోలు జీజీహెచ్ వైద్యశాల, రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు, అంబేడ్కర్ అభిమానులు, ప్రజలు స్వచ్ఛంధంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలాజికల్ సైన్స్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో ప్రభుత్వం మంజూరు చేసిన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య బుధవారం తెలిపారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఎంపికలో స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన వారికి నెలకు రూ.12,500 గౌరవవేతనం చెల్లిస్తామని, వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పనిచేయాల్సి ఉందన్నారు. ఆసక్తి గల వారు తగిన ధృవపత్రాలతో ఈ నెల 5లోగా నాగులుప్పలపాడులోని ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని వారు కోరారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



సిరవల్లిని అభినందిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

మద్దిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాల విద్యార్థిని సిరివల్లి జాతీయ స్థాయి హాకీ పోటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.మాల్యాద్రి తెలిపారు. పాఠశాలకు చెందిన కె.సిరివల్లి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ పీడీ కె.వనజ తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన సిరివల్లిని బుధవారం ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్, ఏపీసీ డి.అనిల్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మయ్యారని ద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ఆరోపించారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీనగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ హింసను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, బి.గోవిందమ్మ, నాగూర్‌బీ, రాజేశ్వరి, అమీరున్నీసా, కె.కోమలి, టి.బాలమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

పన్నులు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాలి

చింతలపాలెం (కొండపి), డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాలని డీపీవో వెంకటేశ్వరరావు కోరారు. చింతలపాలెం గ్రామంలో డీపీవో బుధవారం డీపీవో పర్యటించారు. పారదర్శకంగా గ్రామ పంచాయతీ అధికారులు పనిచేసి ఆదాయ వనరులు పెంచాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డీపీవో ఆదేశించారు. పన్నుల వసూలు పురోగతిని ప్రతిరోజూ పంపించాలని డీపీవో ఆదేశించారు.

చట్టాలపై అవగాహన కలిగించాలి

కొండపి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన కలిగించాలని కొండపి సీఐ సోమశేఖర్ మహిళా పోలీసులను ఆదేశించారు. బుధవారం సీఐ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శక్తియాప్ డౌన్‌లోడ్ చేయడం, స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థినులకు నేరాలకు సంబంధించిన విషయాలపై అవగాహన కలిగించాలన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ లాంటి విషయాలపై విద్యార్థులకు, మహిళలకు అవగాహన కలిగించాలని మహిళా పోలీసులకు సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చీమకుర్తి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. చీమకుర్తి పట్టణం, మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు వాటిని అందజేశారు. చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు పాల్గొని రోటరీ క్లబ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుమార్, క్లబ్ అధ్యక్షుడు తొగటి శ్రీను, కార్యదర్శి శ్రీనివాసరావు, అంబటి వీరారెడ్డి, ముప్పూరి చలమయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎంఈవో, రోటరీ క్లబ్ సభ్యులు

రిమ్స్‌లో పారిశుధ్యం లోపాలను చక్కదిద్దాలి

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి జీజీహెచ్(రిమ్స్)లో పారిశుధ్యం లోపాలను వారంలోపు చక్కదిద్దాలని పరిశీలన కమిటీ, శానిటేషన్ ఏజెన్సీని ఆదేశించింది. కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో నియమితులైన ఆ కమిటీ సభ్యులు బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు ఛాంబర్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు ఎంఓయూ ప్రకారం పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో టి. వెంకటేశ్వర్లు, డీఆర్వో ఓబులేశు పాల్గొన్నారు.

కాలేజీ బస్సు, లారీ ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

బస్సు డ్రైవర్‌కు గాయాలు


దెబ్బతిన్న లారీ, నేలపాలైన కందులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీ బస్సు మరమ్మతుల నిమిత్తం త్రోవగుంట సమీపంలోని ఆటోనగర్ వెళుతుండగా ప్రమాదానికి గురైంది. ఈ సంఘటన దక్షిణ బైపాస్ రోడ్డులోని సంఘమిత్ర ఆసుపత్రి వెనుక వైపు బుధవారం ఉదయం చోటుచేసుకుంది. చెన్నై నుంచి నాగపూర్ కందుల లోడ్‌తో వెళుతున్న లారీ పక్కనే వెళుతున్న కాలేజీ బస్సు ముందు భాగాన ఢీకొట్టింది. దీంతో బస్సు దెబ్బతినడంతోపాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

50 పడకల వైద్యశాలను మంజూరు చేయండి


డీఎంహెచ్‌వోకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగుండూరు గ్రామంలో 50 పడకల కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాలను మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన పలువురు గ్రామస్థులతో కలిసి ఒంగోలులో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 వేలకు పైగా జనాభా కలిగిన ఉప్పుగుండూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజల చిరకాల వాంఛ గ్రామంలో కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటు అని చెప్పారు. వైద్యసేవలకు ఒంగోలుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈక్రమంలో గ్రామంలో వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన కూడా జరిగిందని గుర్తుచేశారు. అందువల్ల ఉప్పుగుండూరులో 50 పడకల వైద్యశాలను మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంజనం వెంకటసుబ్బయ్య, మసిముక్కు భాస్కరరావు, రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ కేఎల్.నాగేశ్వరరావు, తెలగతోటి సుబ్బయ్య, ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కలెక్టర్ రాజాబాబు


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

మద్దిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతమాత్రం సహించబోనని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. బుధవారం మద్దిపాడులోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో పరిస్థితులను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్లపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్ల ప్రాంగణాలు కలియ తిరిగి తరగతి గదులను, టాయిలెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేసి వంట సరుకుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ చిక్కీలను వారికి సక్రమంగా వార్డెన్ అందజేయకపోవడంపై మండిపడ్డారు. వార్డెన్‌ను తక్షణమే అక్కడి నుంచి బదిలీ చేయాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మలజ్యోతిని ఆదేశించారు. ఎస్సీ హాస్టల్‌లో స్టడీఅవర్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అందుకోసం అంచనాలు రూపొందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్‌కు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్లవరం దేవాలయ అభివృద్ధికి రూ.1.50కోట్లు

మద్దిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.50కోట్ల నిధులను కేటాయించినట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మార్నేని రాఘవరావు తెలిపారు. బుధవారం స్థానిక దేవాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సీజీఎఫ్ ఫండ్ నుంచి నిధులు కేటాయింపునకు కృషి చేశారని చెప్పారు. ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్లు మార్నేని కృష్ణారావు, రాంబాబు, శ్రీనివాసరావు, పద్మావతి, ఇంటూరి వెంకటేశ్వర్లు, రమాదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

త్రిపురాంతకం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎండూరివారిపాలెం రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటా ఏ గ్రేడ్ రకం రూ. 2,389, 75కిలోల బస్తా రూ.1,792లుగా చెప్పారు. అలాగే బీ గ్రేడ్‌రకం క్వింటా రూ.2,369, 75 కిలోలు రూ.1,777 ఉందని దళారుల మాటలు నమ్మి మోసపోకుండా ధాన్యం కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. సరుకు అమ్మిన ఆరు గంటల వ్యవధిలోనే నగదు రైతు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమోహన్, వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ మేకల వలరాజుయాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉపయుక్తంగా..!

రైతన్న మీకోసం వర్క్‌షాపులు, ఆర్ఎస్‌కే స్థాయిలో నిర్వహణ
పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు
సీఎం కార్యక్రమం ప్రత్యక్ష వీక్షణ
ప్రస్తుత రబీ, వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌ల ప్రణాళికలపై చర్చ


రైతన్నా మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, డీడీ లక్ష్మానాయక్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రభుత్వం నిర్వహించిన రైతన్న మీకోసం వర్క్‌షాపులు ఉత్సాహంగా, ఉపయుక్తంగా సాగాయి వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలోని రైతు సేవా కేంద్రాల యూనిట్‌గా వీటిని నిర్వహించారు. జిల్లాలో 516 రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)లలో ఇవి జరగ్గా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్న సభా కార్యక్రమాన్ని స్మార్ట్ టీవీల ద్వారా అన్ని ఆర్ఎస్‌కేలలో ప్రదర్శించగా రైతులు వీక్షించారు. రైతులకు వ్యవసాయం లాభసాటే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పంచసూత్రాలను రూపొందించింది. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం వాడకం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాలు మద్దతు అందులో ఉన్నాయి. వివిధ పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి అందిస్తున్న చేయూతను ఈ పంచ సూత్రాలకు అనుసంధానం చేసి రానున్న రోజుల్లో లాభసాటి వ్యవసాయం లక్ష్యంగా ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రూపొందించింది.

సిబ్బంది సర్వే పూర్తి

తొలుత గత నెల 24 నుంచి 29 వరకు క్షేత్రస్థాయిలోని వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈప్రక్రియ సాగగా జిల్లాలోని 516 ఆర్ఎస్‌కేల పరిధిలో సుమారు 2.78 లక్షల రైతు కుటుంబాలను సర్వే చేశారు. ప్రస్తుతం వారు సాగు చేస్తున్న పంటలు, ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతున్న తీరు, ఇంకా వారికి ఏమి కావాలనే అంశాలపై వివరాలు సేకరించారు. ఆ అంశాలను క్రోడీకరించి వాటి ఆధారంగా ఆర్ఎస్‌కే పరిధిలో ప్రస్తుత రబీతోపాటు వచ్చే ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఏఏ పంటల సాగు చేయాలి, లాభసాటిగా ఆ పంటలు ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలను ఎలా అనుసంధానం చేయాలనే దానిపై బుధవారం అన్ని ఆర్ఎస్‌కేలలో రైతులతో వర్క్‌షాపులు నిర్వహించారు. రైతుల అనుభవాలు, వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రణాళికలను రూపొందించనున్నారు. కాగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఆర్ఎస్‌కేలలో జరిగిన కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొనడమే కాక సీఎం సభా కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. అలా ఉత్సాహంగా, ఉపయుక్తంగా సాగిన ఈ కార్యక్రమంలో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మరింత విజయవంతంగా నడిపించారు.

దొడ్డవరంలో జిల్లాస్థాయి కార్యక్రమం

జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మద్దిపాడు మండలం దొడ్డవరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా కలెక్టర్ రాజాబాబు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు. పామూరు మండలం వగ్గంపల్లిలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొనగా పొదిలి మండలం ఆముదాలపల్లి ఆర్ఎస్‌కేలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే టీడీపీ వైపాలెం ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు యర్రగొండపాలెంలోని రైతుభరోసా కేంద్రంలో పాల్గొన్నారు. ఇతర ఆర్ఎస్‌కేల్లోనూ వివిధ స్థాయిల్లోని నాయకులు, అధికారులు పాల్గొని ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వాటి ద్వారా రైతాంగం లాభసాటిగా వ్యవసాయాన్ని కొనసాగించాలని సూచించారు.

వైసీపీ నాయకులకు సిగ్గుందా..!

నాడు జిల్లా, వెలిగొండ సాధించలేక నేడు విమర్శలా
చంద్రబాబు వల్లే మార్కాపురం జిల్లా
ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒక్క రోజు కూడా పశ్చిమ ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచించని వైసీపీ నాయకులు నేడు లేనిపోని విమర్శలు ప్రజాప్రభుత్వం చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 8వ వార్డులో మార్కాపురం జిల్లా ఏర్పాటుకు అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అలుగులో జరిగిన కృతజ్ఞతా సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులకు సిగ్గు, శరం లేదన్నారు. వారి ప్రభుత్వంలో రాష్ట్రంలో నూతనంగా 13 జిల్లాలు ఏర్పాటు చేస్తే మార్కాపురం జిల్లా కావాలని ఏనాడైనా గొంతు విప్పని నాయకులు నేడు విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జిల్లానే కాక వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ఈ ప్రాంత ప్రజల్ని మోసం చేస్తూ జాతికి అంకితం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పశ్చిమ ప్రకాశాన్ని నిలువునా మోసం చేస్తే ప్రజల పక్షాన పోరాడింది టీడీపీ కాదా అని ఆయన అన్నారు. నాడు వైసీపీ ప్రభుత్వం జిల్లా ఇవ్వకుండా మోసం చేస్తే 65 రోజులపాటు దీక్షలు చేశామన్నారు. పోరాటాలు చేసిన వారిని ఆనాటి ప్రభుత్వం ఎన్నో నిర్బంధాలకు గురిచేసిందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు మార్కాపురం జిల్లా చేస్తానని, వెలిగొండ పూర్తిచేసి తానే ప్రారంభిస్తానని చెప్పారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నేడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. అంతేకాక వెలిగొండ ప్రాజెక్టును కూడా 2026 అక్టోబర్‌లోపు తప్పకుండా పూర్తిచేసి జలాశయంలోకి నీరు చేరే విధంగా చర్యలు చేపడతారన్నారు. హామీలను అమలు చేస్తుంటే తమ ఉనికికి ఎక్కడ ప్రమాదం ఏర్పడుతుందో అని భయపడి వైసీపీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కోటి సంతకాల పేరుతో ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, మాజీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.జాబీర్‌హుసేన్‌బేగ్, మాజీ కౌన్సిలర్ షేక్ బషీరున్నీసాబేగం, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, నాయకులు దొడ్డా నాగిరెడ్డి, ఎం.షాకీర్‌హుసేన్‌బేగ్, టౌన్ యూత్ అధ్యక్షుడు దొడ్డా దుర్గేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతి కేసులో 12మంది అరెస్ట్

12మందిపై హత్యకేసు నమోదు చేసిన పోలీసులు
అరెస్టయిన వారిలో పలువురు ప్రముఖులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ మృతి కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... పొదిలి మండలానికి చెందిన ఉడుముల ప్రకాశ్ కనిగిరి మున్సిపాల్టీ పరిధిలోని మాచవరం గ్రామంలో ప్రార్థన మందిరాన్ని నిర్మించి అక్కడే బోధకుడిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆమె బంధువులు ప్రకాష్‌తో పలుమార్లు గొడవపడ్డారు. గ్రామంలో ప్రార్థన మందిరం నడపటంపైనా వివాదం ఉంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు నెల రాత్రి సమయంలో మందిరంలో నిద్రిస్తున్న ప్రకాశ్‌పై ఆ మహిళా బంధువులు కర్రలతో దాడి చేసి బురద గుంటలో పడవేశారు. ఈ విషయాన్ని ప్రకాష్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. వారు వచ్చి చూసే సరికి అతను అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వారు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ సమయంలో కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో ప్రకాష్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతున్న ప్రకాశ్ రెండు రోజులు గడిచిన తర్వాత ఆసుపత్రి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు నెలలు గడిచిన తర్వాత ఒంగోలులో ఓ ప్రైవేటు మాల్ ఎదుట తీవ్ర అనారోగ్యంతో మతిస్థిమితం కోల్పోయి పడిఉండటాన్ని గమనించిన అతని బంధువులు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రెండురోజుల తర్వాత ప్రకాష్ మృతి చెందాడు. పోస్టుమార్టం ఆధారంగా మృతుడు ప్రకాశ్‌పై కర్రలతో దాడి చేసిన నేపథ్యంలో బలమైన గాయమై మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పాస్టర్ మృతికి కారకులైన మాచవరం గ్రామానికి చెందిన 10 మందితో పాటు కనిగిరి పట్టణానికి చెందిన కేశవరావుపై, పాతూరుకు చెందిన లక్ష్మీప్రసన్నపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ టీ శ్రీరాం, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రజాపాలనలోనే సాధ్యం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
జేసీ అగ్రహారం సర్పంచ్ వైసీపీని వీడి టీడీపీలో చేరిక


ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బేస్తవారపేట మండలం జేసీఅగ్రహారం గ్రామసర్పంచ్ మేకల రమణయ్య వైసీపీని వీడి తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలుతోపాటు ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పట్టణ, గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ అగ్రహారం సర్పంచ్ మేకల రమణయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించడం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పునాది పడినట్లు అయిందని తెలిపారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయాలంటే ఒక్క రూపాయి కూడా నిధులు లేవని, నేడు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో తోట వెంకటరంగారెడ్డి, పీపీజెన్ని చెన్నారెడ్డి, కేతిరెడ్డి, కొండెపోగు సుధాకర్, కత్తి దావీద్, కత్తి తిమోతి తదితరులు ఉండగా కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాపిజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థిని తల్లికి ఆర్థిక సాయం


మనోహరమ్మకు చెక్ అందిస్తున్న మంత్రి స్వామి

రాచర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతూ అనారోగ్యంతో మృతిచెందిన కొఠారి కర్ణ అనే విద్యార్థిని తల్లి మనోహరమ్మకు రూ.3లక్షల చెక్కును బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి అందజేశారు. విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందడం, అంతకు ముందే తండ్రి చనిపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలిక తల్లి మనోహరమ్మకు జీవనోపాధి కోసం గురుకులాల సొసైటీ నుంచి రూ.3లక్షలు ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాలతో మంత్రి ఈ సాయం అందించారు. ప్రిన్సిపాల్ మేరి మంజుల, డీసీవో జయ, పాఠశాల ఉపాధ్యాయిని విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధన

గిద్దలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాశినాయన ఆశ్రమంలో ఈనెల 4, 5 తేదీలలో ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు తెలిపారు. 4వ తేదీన ప్రత్యేక పూజలు, పండరి భజన కార్యక్రమం, 5వ తేదీన దత్తజయంతి, కాశినాయన ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు వేలాదిమందికి అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా ఆరాధన మహోత్సవంలో పాల్గొనున్నారని తెలిపారు.

ఆరాధనకు 15 బస్సు సర్వీసులు

శ్రీకాశినాయన ఆరాధన సందర్భంగా ఈనెల 4, 5 తేదీలలో 15 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపనున్నట్లు ఇన్‌చార్జి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి రైళ్లలో గిద్దలూరు వచ్చే భక్తుల సౌకర్యార్థం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసి బస్సు సర్వీసులను నడుపుతామని పేర్కొన్నారు.

మార్కాపురం జిల్లాలో దర్శి, దొనకొండను కలపాలి

కంభం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ప్రజల కోరిక మేరకు మార్కాపురంను జిల్లా చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు దర్శి నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌గా గతంలో రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అన్ని అర్హతలు ఉన్న దొనకొండను కూడా మార్కాపురంలో కలిపితే బాగుంటుందని మార్కాపురం జిల్లా సాధన సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు దేవిరెడ్డి నాగేంద్రుడు, మీనిగ ప్రసాదులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు కంభంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మార్కాపురంను జిల్లా చేస్తున్నామని ప్రకటించినందుకు హర్షిస్తున్నామన్నారు. దర్శిని మినహాయించి నాలుగు నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రభుత్వం దర్శి, దొనకొండలను మార్కాపురం జిల్లాలో కలపడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును నికర జలాలకు కేటాయించి త్వరగా పూర్తి చేసి నీరు ఇవ్వాలని కోరారు. సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ వి. బాలు, నారు ఆదినారాయణ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన వీవోఏపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(రూరల్), డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలు ఇప్పిస్తానంటూ నగదు వసూలు చేసి మోసం చేసిన వీవోఏ బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని ఉలిచి గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఒంగోలులో కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తామంటూ వీవోఏ ఇండ్ల బాలకృష్ణ ఉలిచి, బీవీపాలెం, పలు గ్రామాలకు చెందిన రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించాడన్నారు. గతంలో కలెక్టర్‌కు, పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాడు ఏడీఏ రమేష్‌బాబు విచారణ కూడా చేశారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్ రాజాబాబును కోరారు.

మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా

గిద్దలూరు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి స్థానిక అడిషనల్ జూనియర్ కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. మద్యం తాగి ఆటో నడిపిన వ్యక్తికి 24 రోజులు జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించారు. అలాగే మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన నలుగురికి ఒక్కొక్కరికి 23 రోజుల జైలు శిక్షతోపాటు రూ. 10వేలు జరిమానా విధించారు. అలాగే మరొకరికి 24 రోజులు శిక్ష, రూ. 10వేలు జరిమానా విధించారు. ఇంకొకరికి 26 రోజుల శిక్ష, రూ. 10వేలు జరిమానా విధించారు. ఇంకో కేసులో ఒకరికి 22 రోజులు శిక్ష, రూ. 10వేలు జరిమానాను న్యాయాధికారి భరత్‌చంద్ర విధించారు.

నేడు డీడీవో కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

మార్కాపురం రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభిస్తారని మార్కాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బాలునాయక్ మంగళవారం తెలిపారు. రాయవరం వద్ద ఉన్న సీఎల్ఆర్‌సీ భవనాన్ని డీడీవో కార్యాలయంగా మార్పు చేసినట్లు తెలిపారు.

www.andhrajyothy.com
8 పేజీలు
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI గురువారం 4-12-2025 ఒంగోలు





ఇటు ప్రజా సేవ... అటు బాధ్యతల నిర్వహణ.. అంతకుమించి రెండో వ్యాపకం లేని ప్రజాప్రతినిధి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి. అన్నింటికీ మించి నిబద్ధత, నిజాయితీకి నిలువుటద్దం... నాడు కేవలం ఎమ్మెల్యేగా, నేడు మంత్రిగా ఈ విషయాల్లో ఎక్కడా రాజీపడకపోవడం ఆయన ప్రత్యేకత. ఎమ్మెల్యేగా స్వామి హ్యాట్రిక్ విజయం సాధించారు. తొలిసారి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నరలోనే సూపర్ సక్సెస్ అయ్యారు. పాలనలో తనదైన ముద్ర వేసుకోగలిగారు. తన మంత్రిత్వ శాఖల పరిధిలో అనేక ప్రజోపకర సంస్కరణలకు శ్రీకారం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి పాలనలో భాగస్వాములుగా ఉన్న ముఖ్యప్రజాప్రతినిధులు, ఉన్నత అధికార యంత్రాంగం మొత్తం మంత్రిగా స్వామిని కొనియాడటం అందుకు దర్పణం పడుతోంది. నిజానికి తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామికి చిన్నపాటి శాఖలు లభించవచ్చని ఊహించారు. అయితే తన మనసుకు నచ్చిన, తనకున్న సేవాగుణానికి అనుగుణమైన శాఖలను ఏరికోరి స్వామికి అప్పగించి సీఎం ప్రత్యేకతను చాటుకున్నారు. బడుగు, బలహీన వర్గాలకు అపారమైన సేవ చేసే అవకాశం ఉన్న సాంఘిక సంక్షేమ శాఖతోపాటు దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖలు ఆయనకు లభించాయి. వీటికి తోడు సచివాలయ శాఖ కూడా దక్కింది. గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ శాఖలన్నింటినీ మూలనపడేశారు. కొత్తగా వచ్చిన సచివాలయ వ్యవస్థకు సరైన దిశానిర్దేశాన్ని రూపొందించలేదు. దీంతో మొత్తం తన పరిధిలోని శాఖలను గాడిలో పెట్టేందుకు మంత్రి స్వామి.. ఓర్పు, నేర్పుతో వ్యవహరించాల్సి వచ్చింది. బడుగు, బలహీన వర్గాలకు సంబంధించి ఆగిపోయిన సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ పట్టాలెక్కించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు ఆసరానిచ్చే కార్యక్రమాలను దారిలోకి తెచ్చారు. అన్నింటికీ మించి సచివాలయ వ్యవస్థ నిర్వహణకు మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రాణదాతగా నిలిచారు. వారికి అందని ద్రాక్షగా మిగిలిన ఉన్నత విద్యకు సంబంధించి ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. నీట్, సివిల్స్ పరీక్షలకు అవసరమైన శిక్షణను ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయగలిగారు. ఏడాదిన్నరలోనే కొండపి నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లకు పైగా నిధులు తేగలిగారు. హాస్టళ్ల భవనాలకే కాదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణాలకు నిధులు సాధించారు. కొండపి పరిధిలోని నదులకు 0.6 టీఎంసీల సాగర్ నీటిని కేటాయించడం, వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో కొండపి ప్రాంతాన్ని చేర్పించడం, పాకల బీచ్ అభివృద్ధి, మర్రిపూడి మండలం పృథులగిరికి ఘాట్ రోడ్డు నిర్మాణం లాంటి అనేక అభివృద్ధి పనుల్లో విజయం సాధించారు. ఇలా అటు శాఖాపరమైన పనులు, ఇటు ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు, జిల్లాకు చెందిన మంత్రిగా.. చివరకు ఎమ్మెల్యేగా బాధ్యతల నిర్వహణలో కూడా ఆయన సఫలీకృతులయ్యారు.

సీఎంఆర్ఎఫ్ నిధులు రాబట్టంలోనూ దిట్ట డోలా

కొండపి నియోజకవర్గంలో వైద్య చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక చేయూతను అందించే విషయంలోనూ మంత్రి డాక్టర్ స్వామి ముందు వరుసలో ఉన్నారు. ఇప్పటి వరకు మొత్తం 1,243 మందికి రూ.9.69కోట్లను మంజూరు చేయించారు. అందులో 1,164 మం




దికి చికిత్స అనంతరం నేరుగా సహాయ నిధి చెక్కులను అందజేశారు. మరో 79 మందికి ఎల్‌వోసీలు ఇప్పించారు. అత్యవసర వైద్యం అవసరమున్న వారి దరఖాస్తులను స్వయంగా ఆయనే సీఎం వద్దకు తీసుకెళ్లి నిధులు ఇప్పించడం స్వామి ప్రత్యేకత. అందుకే లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసొచ్చి ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

హాస్టళ్ల భవనాలు, మరమ్మతులకు భారీగా...

హాస్టళ్లకు కొత్త భవనాల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు సాధించడంలో మంత్రి స్వామి సఫలీకృతులయ్యారు. అందుకోసం తొలి ఏడాదిలోనే రూ.212 కోట్లు సాధించారు. 29 కొత్త హాస్టళ్ల భవనాల నిర్మాణాలకు రూ.105 కోట్లను మంజూరు చేశారు. వాటిలో జిల్లాకు, ప్రత్యేకించి కొండపి నియోజకవర్గానికి కాస్తంత అధికంగానే మంజూరు చేయించగలిగారు. ఎర్రగొండపాలెం, ఒంగోలు, చీమకుర్తి, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో హాస్టళ్ల భవనాలకు విద్యాశాఖ నుంచి కూడా పెద్దమొత్తంలో నిధులను రాబట్టగలిగారు.

డోలా.. భళా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి స్వామి (ఫైల్)



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి

- ఇటు ప్రజా సేవ... అటు సమర్థవంతంగా బాధ్యతలు
- ఏడాదిన్నర పాలనలోనే మంత్రి స్వామి సూపర్ సక్సెస్
- వసతి గృహ విద్యార్థులకు ప్రాణదాత
- వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.. నిరంతర పర్యవేక్షణ
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం
- తీవ్రసమస్యతో ఉన్న 39 మందికి ఊపిరి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు:

ప్రభుత్వ వసతి గృహాల్లోని చిన్నారులకు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రాణదాత అయ్యారు. ఆయనలోని సేవాగుణానికి తోడు వైద్య వృత్తిలో ఉన్న అనుభవం అందుకు దోహదపడింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిన్నరలోనే వసతి గృహాల్లో ఉంటూ ఆరోగ్య సమస్యలతో ప్రాణాలతో పోరాడుతున్న 39 మంది విద్యార్థుల విషయంలో ఆయన చూపిన శ్రద్ధ వారికి ఊపిరిపోశాయి. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ప్రభుత్వం నడుపుతున్న వసతి గృహాలు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కునారిల్లాయి. సమస్యలతో కొట్టుమిట్టాడాయి. ఒకవైపు కనీస సౌకర్యాలు లేక, మరోవైపు అనారోగ్య సమస్యలకు గురైన చిన్నారుల ఆలనాపాలనా పట్టించుకునే వారు లేక అల్లాడిపోయారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీబాలవీరాంజనేయస్వామి వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటు వసతుల కల్పనతోపాటు, అటు చిన్నారుల బాగోగులపై నిశిత పరిశీలన చేశారు.

విద్యార్థుల బాగోగులపై ఎప్పటికప్పుడు సమాచారం

మంత్రి స్వామి హాస్టళ్లలో వసతుల కల్పనకు నిధుల రాబట్టడంతోపాటు లోపభూయిష్టంగా ఉన్న వాటి నిర్వహణ తీరుతెన్నులను మార్చేందుకు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలోనే అనేక మంది విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి కాకుండానే హాస్టళ్ల నుంచి వెళ్లిపోయినట్లు రికార్డుల ద్వారా గుర్తించారు. దానికి కారణం ఏమిటని ఆరా తీశారు. అలాంటి వారిలో కొందరు అనారోగ్యంతో మృతి చెందారన్న విషయాన్ని అధికారులు, వార్డెన్‌ల ద్వారా తెలుసుకుని చలించిపోయారు. హాస్టళ్లలో ఉంటూ వ్యాధికి గురైన విద్యార్థులను వారి తల్లిదండ్రుల వద్దకు పంపడం మినహా ఎలాంటి వైద్య చికిత్సలు చేయించని విషయాన్ని గుర్తించారు. అలాంటి వారిలో అసలు తల్లిదండ్రులు లేని అనాథలు కూడా ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో అన్ని హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్య అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశాలు జారీ చేశారు. సమీపంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రాల నుంచి వైద్య చికిత్సలు అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఏఎన్ఎంలు హాస్టళ్లను సందర్శించి ప్రాథమిక వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. అన్నింటికీ మించి రాష్ట్రంలో ఏహాస్టల్‌లో విద్యార్థి అస్వస్థతకు గురైనా, విషపురుగుల కాటుకు గురైనా వెంటనే తన దృష్టికి తేవాలని ఉత్తర్వులు ఇచ్చారు. అందుకోసం వాట్సాప్‌లో ఎప్పటికప్పుడు సమాచారం సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే అనారోగ్యానికి గురైన విద్యార్థులను ఇళ్లకు పంపకుండా వైద్య చికిత్సలు చేయించే విధానానికి శ్రీకారం పలికారు.



ప్రత్యేక చికిత్స... ఆర్థిక చేయూత

మంత్రి స్వామి తీసుకున్న ప్రత్యేక చర్యలతో హాస్టల్ విద్యార్థులు అనారోగ్యానికి, ప్రమాదాలకు గురైనా తక్షణమే ఆయన దృష్టికి వెళ్తుంది. వెంటనే సంబంధిత వార్డెన్‌లు, అధికారులతో స్వయంగా మాట్లాడి చికిత్సలు చేయించడం ప్రారంభించారు. అందుకు నిధుల సమస్య కూడా ఎదురైంది. వెంటనే ఆయన తన శాఖ పరిధిలో నుంచి కొంత మొత్తాన్ని ఇంకో వైపు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరికొంత రాబట్టడంతోపాటు ఆయా జిల్లాల కలెక్టర్ల పరిధిలోని నిధుల నుంచి కూడా వ్యాధిగ్రస్థులైన విద్యార్థుల చికిత్సలకు సమకూర్చడం ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యశాలల్లో కూడా వైద్యం చేయిస్తూ అదనంగా అయ్యే ఖర్చును తాను సమకూర్చుతూ విద్యార్థులకు ప్రాణం పోశారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు ఇవీ..

- శ్రీకాకుళంలోని గురుకుల పాఠశాలలో చరణ్ అనే విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికారులు చికిత్స చేయించలేక చేతులెత్తేశారు. మంత్రి స్వామి జోక్యం చేసుకొని తన శాఖ నుంచి రూ.2లక్షలు ఇవ్వడంతోపాటు సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మరో రూ.2లక్షలు ఇప్పించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి పూర్తి స్వస్థతతో రేపోమాపో వైద్యశాల నుంచి డిశ్చార్జ్ కానున్నారు.
- విశాఖపట్టణంలో ఒక హాస్టల్ విద్యార్థికి కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. చికిత్స చేయించలేమని అధికారులు తేల్చేశారు. వెంటనే మంత్రి ఒక కార్పొరేట్ ఆసుపత్రి వారితో మాట్లాడి ఆ విద్యార్థిని అక్కడ చేర్పించి చికిత్స చేయి స్తున్నారు. ఇప్పటి వరకూ రూ.16 లక్షలు వెచ్చించారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మడివరం హాస్టల్‌లో అక్కాచెల్లెలు ఇంటి సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తన దృష్టికి రాగానే ఉత్తమ వైద్య చికిత్స చేయించి వారిలో ఒకరిని బతికించగలిగారు.
- కొండపి గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థిని అపెండిసైటిస్‌కు గురైన విషయం తెలియగానే గంటల వ్యవధిలో ఆపరేషన్ చేయించి కాపాడ గలిగారు. పాముకాటుకు గురైన విద్యార్థులకు తన పర్యవేక్షణలో వైద్య చికిత్సలు చేయించి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ఇలా హాస్టళ్లలో ఉంటూ వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోతున్న వారికి ఊపిరి పోస్తున్నారు.
- విద్యార్థుల రక్షణకు కూడా మంత్రి స్వామి చర్యలు తీసుకున్నారు. ఉదాహరణకు నంద్యాల జిల్లా డోన్‌లో ఒక విద్యార్థి హాస్టల్ నుంచి చెప్పకుండా వెళ్లిపోతే స్వయంగా అక్కడి పోలీసులతో మాట్లాడి గంటల వ్యవధిలోనే అతన్ని గుర్తించి తల్లితండ్రుల వద్దకు చేర్చారు.



కొండపి మండలం నెన్నూరుపాడు వద్ద రూ.3కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్డు

గాడినపడుతున్న సచివాలయ వ్యవస్థ

- మూడంచెల్లో పర్యవేక్షణ
- ఉద్యోగుల సర్దుబాటు
- మంత్రి స్వామి ప్రతిపాదనలకు ఓకే అన్న సీఎం చంద్రబాబు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

మంత్రిగా సాధారణ పరిపాలనకే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పరిమితం కాలేదు. తన పరిధిలోని శాఖలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని చక్కదిద్దేందుకు సరికొత్త నిర్ణయాలు తీసుకోవడంలో తనకు తానే సాటిగా నిలుస్తున్నారు. ప్రధానంగా గ్రామ సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థకు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రజోపయోగకరంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు ఆ బాధ్యతను సంబంధిత మంత్రి అయిన డాక్టర్ స్వామికి అప్పగించారు. వెంటనే స్వామి సచివాలయ వ్యవస్థ తీరుతెన్నులపై అధ్యయనం చేశారు. తద్వారా సచివాలయ వ్యవస్థ నిర్వహణలో ఉన్న అనేక లొసుగులను గుర్తించారు. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఒక్కొక్కరు ఒక్కో శాఖ పరిధిలో ఉండటం వలన విధి నిర్వహణలో వారిపై సరైన అజమాయిషీ లేదన్న విషయాన్ని గమనించారు. అంతేకాక అదనపు ఉద్యోగులు సచివాలయాల్లో ఉంటూ తగిన పనిలేక తిరగడాన్ని గమనించారు. వీటితోపాటు మరికొన్ని అంశాలను కూడా తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం పలికారు.

సచివాలయాలపై పక్కాగా పర్యవేక్షణ

సచివాలయాల పర్యవేక్షణకు మూడంచెల విధానానికి మంత్రి స్వామి రూపకల్పన చేశారు. అందులో భాగంగా సచివాలయంలో ఒక ఇన్‌చార్జి, మండల స్థాయిలో ఒక అధికార బృందాన్ని నియమించాలని నిర్ణయించారు. వారందరినీ పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక అధికారితో టీం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ మూడంచెల విధానం ఆవశ్యకతను అటు ముఖ్యమంత్రి, ఇటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రతిపాదనను క్షుణ్ణంగా సమీక్షించిన ముఖ్యమంత్రి దాని అమలుకు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ప్రతి మండ లంలో సచివాలయాలను పర్యవేక్షించేందుకు ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించి ఆయన కింద పనిచేసేందుకు ఉద్యోగులను కేటాయించారు. జిల్లాస్థాయిలో సచివాల యాల పర్యవేక్షణ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాస్థాయి అధికారిగా డిప్యూటీ కలెక్టర్ హోదాకల్గిన అధికారిని నియమించేందుకు చర్యలు చేపట్టారు.

ఉద్యోగుల రేషనైలేజేషన్

సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు రేషనైలేజేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చి సర్దుబాటు చేసే ప్రక్రియకు శ్రీకారం పలికారు. ఆయా సచివాలయాల పరిధిని దృష్టిలో ఉంచుకొని అందులో ఎంతమంది ఉద్యోగులు ఉండాలో నిర్ధారించారు. తదనుగుణంగా అధికంగా ఉన్న ఉద్యోగులను అవసరమైన సచివాలయాలకు బదిలీ చేస్తున్నారు. తగిన విద్యార్హత ఉన్న ఉద్యోగులను ఇతర కొన్ని శాఖలకు అటాచ్ చేసి అక్కడ పని కల్పించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మండలస్థాయి కార్యాలయాల ఏర్పాటు జర్గా ఉద్యోగుల సర్దుబాటు పక్రియ కూడా వేగంగా జరుగుతోంది. జిల్లాస్థాయి అధికారుల నియామకానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వార్డు సచివాలయాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి

మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో సచివాలయాల పర్యవేక్షణ బాధ్యత ప్రస్తుతం కమిషనర్ల పరిధిలో ఉంది. వారికి ఉండే పని ఒత్తిడి వలన సచివాలయాల పనితీరును పర్యవేక్షించలేక ఇబ్బంది పడుతున్నారు. తదనుగుణంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో సచివాలయాల నిర్వహణకు ఒక అధికారిని నియమించి వారిని యథావిధిగా కమిషనర్ల పరిధిలో ఉంచే విధానానికి శ్రీకారం పలకబోతున్నారు. ఈ మార్పులు మొత్తానికి సీఎం ఓకే చెప్పారు.

సచివాలయాలకు కొత్తపేరు

సచివాలయా వ్యవస్థలో సంస్కరణలకు సంబంధించి మంత్రి స్వామి చేసిన ప్రతిపాదనను మెచ్చుకున్న ముఖ్యమంత్రి సచివాలయాలకు కొత్త పేరును ఎంపిక చేసే బాధ్యతను కూడా ఆయనకు అప్పగించారు. అందుకోసం ఐదు పేర్లు గుర్తించి పరిశీలన చేస్తున్నారు. అందులో రెండు పేర్లను మంత్రి స్వామి సూచిస్తే వాటిలో ఒక పేరును సీఎం ఖరారు చేయనున్నారు. తొలి ఏడాదిలోనే మొత్తం సచివాలయాల వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించి గాడిలో పెట్టేందుకు స్వామి చేసిన ప్రయత్నాలు మరికొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్నాయి.

రోడ్లు.. నీళ్లు..



జలవనరులశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి (ఫైల్)

వెలిగొండ నుంచి పాలేరుకు 0.60 టీఎంసీల నీరు

నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు నుంచి పాలేరుకు 0.60 టీఎంసీల నీటిని ఇచ్చేలా మంత్రి స్వామి ఉత్తర్వులు సాధించారు. వెలిగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి ఈ నీరు రానుంది. ఆ జలాలు పాలేరు నదిలో ప్రవహించడం ద్వారా నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి మండలాల ప్రజలకు ఉపకరించనున్నాయి. ఆ నదుల పరిసరప్రాంత గ్రామాల్లో తాగునీటికి ఉపయుక్తం కానున్నాయి. మరో వైపు జలజీవన్ మిషన్ ద్వారా సాగర్, వెలిగొండ జలాలతో తాగునీటి ఇక్కట్లు శాశ్వతంగా తీరేలా పలు పథకాలకు మంత్రి స్వామి రూపకల్పన చేశారు.

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

కొండపి నియోజకవర్గంలో అత్యంత కీలకమైన రోడ్లు, సాగు, తాగునీటి రంగాలపై అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. భారీగా నిధులు సాధించారు. పంచాయతీరాజ్, అర్‌అండ్‌బీ శాఖల పరిధిలో వివిధ గ్రాంట్ల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక 17 నెలల్లోనే రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.92.14 కోట్ల మేర నిధులు సాధించారు. ఇటు సాగర్, అటు వెలిగొండ జలాలను కొండపి నియోజకవర్గానికి కేటాయిస్తూ ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు సాధించారు. పూర్తి గ్రామీణ ప్రాంతంగా ఉంది, వర్షాధారం తప్ప ఎలాంటి నీటి వసతి లేని కొండపి నియోజకవర్గానికి ఇది ఎంతో ఊరట కలిగించే అంశం. గతంలోనే నిర్మాణం ప్రారంభించి నిలిచిపోయిన సంగమేశ్వరం ప్రాజెక్టుపైనా మంత్రి డాక్టర్ స్వామి దృష్టి సారించారు. పాలేరు, ముసి నదులు నియోజకవర్గం నుంచే వెళ్తున్నప్పటికీ ప్రతి ఐదేళ్లలో మూడేళ్లు వాటిలో నీరు పారడం కష్టంగా మారింది. దీంతో వాటి ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాలు పనిచేయని పరిస్థితి నెలకొనడంతో పంటల సాగు కోసం రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సి వచ్చి అవస్థ పడుతున్నారు. పొగాకు, శనగ

మిగతా 3వ పేజీలో

- కీలకరంగాలపై మంత్రి డాక్టర్ స్వామి ప్రత్యేక దృష్టి
- కొండపి నియోజకవర్గానికి సాగర్, వెలిగొండ జలాలు
- సాగు, తాగునీటి సమస్యల నుంచి ఉపశమనం
- వివిధ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం
- మరమ్మతుల కోసం రూ.92.64 కోట్లు
- పాలేరుపై ముప్పాళ్ల-పైడిపాడు మధ్య రూ.27.83 కోట్లతో నూతన బ్రిడ్జి నిర్మాణం

అభివృద్ధిలో సింగరాయకొండ అదుర్స్

- మండలంపై మంత్రి డాక్టర్ స్వామి ప్రత్యేక దృష్టి
- ఆయన చొరవతో ఏడాదిన్నరలో రూ.10 కోట్లకు పైగా అభివృద్ధి పనులు
- ట్రంకు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, స్టేషన్‌కు రూ.2.20 కోట్లు మంజూరు
- పాకలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంపై ఫోకస్
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజానీకం



రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన ఓవీరోడ్డు



సింగరాయకొండలో నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్

సింగరాయకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండల అభివృద్ధిపై మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సుమారు రూ. 10 కోట్లపైగా అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అందులో పల్లెపండగ కార్యక్రమం కింద 10 గ్రామాల్లో రూ.3.5 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు. రూర్బన్ నిధులు రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గుంతలు, గోతులతో అధ్వానంగా ఉన్న ఓవీ రోడ్డుకి విముక్తి లభించింది. సుమారు 1.85 కి.మీ రోడ్డు అభివృద్ధికి రూ. 2కోట్లు ఎన్డీబీ నిధులు మంత్రి స్వామి మంజూరు చేయించారు. దీంతో స్థానిక కందుకూరు ఫ్లైవోవర్ నుంచి కటింగ్ వద్ద వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. చేపల మార్కెట్ ఎదుట రూ.47 లక్షలతో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని పూర్తిచేయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.1.25 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారు. కందుకూరు రోడ్డులోని ఎస్సీ బాలుర వసతి గృహానికి రూ.40 లక్షలు మంత్రి స్వామి మంజూరు చేశారు. ఈ నిధులతో హాస్టల్ ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. బీసీ బాలికలు, బాలుర హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 లక్షలు కేటాయించారు. నియోజకవర్గానికి తొలుత మంజూరైన అన్న క్యాంటీన్‌ను పేదలు, కార్మికులు ఎక్కువగా ఉండే సింగరాయకొండకు మంజూరు చేయించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు రూ. 61 లక్షలతో శరవేగంగా క్యాంటిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



రూ. 46 లక్షలతో పూర్తిచేసిన కూరగాయల మార్కెట్

తీరప్రాంతంలో భారీగా అభివృద్ధి పనులు

పాకల తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై మంత్రి స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రూ.కోటి పైగా అభివృద్ధి పనులు పూర్తి చేయించారు. తీరం వెంబడి పర్యాటకుల అనువుగా ఉండడానికి సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్స్, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయించారు. ఊళ్లపాలెం తీరప్రాంతంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులను మంత్రి సూచనలతో అధికారులు పూర్తి చేశారు. రెండు నెలల క్రితం కలెక్టర్, పర్యాటకశాఖ అధికారులు కలిసి పాకల తీరంలో పర్యటించారు. పర్యాటక అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేశారు.

పీబీ చానల్‌కు రూ.1.40 కోట్లు మంజూరు

పాలేరు-బిట్రగుంట సప్లై చానల్ అభివృద్ధికి మంత్రి స్వామి చొరవతో రూ. 1.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాలువ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు పీబీ ఛానల్ పరిధిలో ఉండే 7 గొలుసుకట్టు చెరువులు పుష్కలంగా నిండాయి. దీంతో రైతులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. గజానికొక గుంత ఉన్న సింగరాయకొండ ప్రధాన రహదారి ట్రంకురోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, శిథిలావస్థలో ఉన్న స్థానిక పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంత్రి స్వామి మంజూరు చేయించారు. మంత్రి డాక్టర్ స్వామి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మర్రిపూడిలో రూపురేఖలు మారుతున్న రోడ్లు

మర్రిపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న పలు గ్రామీణ రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో గ్రామీణులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో మంత్రి స్వామి అంతర్గత రహదారులతోపాటు లింక్‌రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రూ.6కోట్లు మంజూరు చేయించారు. 3కోట్ల 15 లక్షలతో 8 గ్రామాలలోని 3.05 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారులను సిమెంటు రోడ్లుగా మార్చడంతోపాటు 2కిలోమీటర్ల మేర సైడు కాలువలు నిర్మించారు. మండలంలోని వేమవరంలో కోటి నిధులతో అర్అండ్‌బీ ప్రధాన రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రూ1.13కోట్లతో వీరారెడ్డిపాలెం నుంచి పచ్చవ రోడ్డు వరకు 1.04 కిలోమీటర్ల మేర తారురోడ్డును నిర్మించారు. ఈ రహదారి నిర్మాణం వలన మర్రిపూడి, జరుగుమల్లి మండలాలకు అనుసంధానం ఏర్పడింది. గత 40 ఏళ్లుగా దారిలేక చిట్టడవులను తలపించే చిల్లచెట్ల మధ్య నిత్యం ప్రాణభయంతో అడుగుతీసి అడుగుపెట్టలేని చందంగా ఉన్న గార్లపేట ఎస్సీకాలనీకి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.74లక్షల వ్యయంతో 600 మీటర్ల మేరకు సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా ప్రధాన గ్రామం నుంచి కాలనీ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో 40ఏళ్లుగా కాలనీ వాసులు పడిన కష్టాలు తొలగిపోయాయి. మొత్తం మీద మంత్రి స్వామి చొరవతో పల్లెసీమలు నూతన శోభను సంతరించుకున్నాయి.



నూతనంగా నిర్మించిన వీరారెడ్డిపాలెం రహదారి

ఇగోకు దూరంగా... వివాదరహితంగా...

- అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం
- సొంత అజెండా లేకుండా ప్రభుత్వ ప్రాధాన్యతలే ప్రధానాంశాలుగా ముందుకు
- తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణం స్పందన
- అందరివాడిలా సాగుతున్న మంత్రి డాక్టర్ స్వామి
- కీలకమైన విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాణింపు

(ఆంధ్రజ్యోతి-ఒంగోలు)

రాష్ట్రమంత్రివర్గంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం.. అటు పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో, ఇటు పార్టీ నిర్మాణంలో ఆయన అత్యంత కీలకం. ఆపై మరొక జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి. అన్ని బాధ్యతలు నిర్వహించడం కత్తిమీద సామే. ఈ క్రమంలో ఎక్కడో ఒకచోట తన మాట నెగ్గాలన్న పట్టుదలకు పోతుంటారు. దాని వల్ల వివాదాలు ఏర్పడి కొందరు ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉంటుంటారు. ఒక్కో సమయంలో అలాంటి వివాదాలు అధినేత వరకూ వెళ్తుంటాయి. కానీ ప్రస్తుతం చంద్రబాబునాయుడు కేబినెట్‌లో జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వివాద రహితంగా అందరివాడిలా ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో సమస్యను బట్టి తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పడంలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా వ్యవహరిస్తున్నారు. సొంత అజెండా లేకుండా ప్రభుత్వ ప్రాధాన్యతలు, అధినేత ఆదేశాలే ప్రధానం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో తనకు రాజకీయంగా, ఆర్థికంగా కొండంత అండగా నిలుస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు, ఆయన కుమారుడైన రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముగ్గురిదీ పార్టీ నిర్వహణ, పాలనా వ్యవహారాల్లో ఒకే మాటగా సాగుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో అధికారంలో ఉన్న పెద్దలపై అనేక అవినీతి ఆరోపణలు రావడం, వివాదాలు చుట్టుముట్టడం అత్యంత సహజమైన విషయం. అయితే అలాంటి వాటికి దూరంగా స్వామి నిలుస్తున్నారు. జిల్లాలోని ఇతర కీలక ప్రజాప్రతినిధులు, పాలనా యంత్రాంగానికి తలలో నాలుకలా ఉంటున్నారు. తన దృష్టికి వారు తెచ్చే అంశాలపై వెంటనే స్పందిస్తున్నారు. అవసరమైతే ప్రభుత్వంలో కీలకపెద్దలు, ఇతర శాఖల మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. అంతకుమించి ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం సాధించడంలో సక్సెస్ అయ్యారు.

అన్నిప్రాంతాలకూ ప్రాధాన్యం

మంత్రిగా ప్రభుత్వంలో తనకు ఉండే పలుకుబడిని కేవలం తాను ప్రాతినిధ్యం వహించే కొండపి నియోజకవర్గానికే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాల అవసరాలు, అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకుల మనోభావాలకు అనుగుణంగా ఉపకరించేలా స్వామి వ్యవహరిస్తున్నారు. తన శాఖ ద్వారా నిధులు మంజూరులోనూ అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇతర సామాజిక అంశాలు, ప్రజా సమస్యలు ఏవి తన దృష్టికి వచ్చినా వాటి పరిష్కారానికి చొరవచూపుతున్నారు. అందుకు ఒంగోలు డెయిరీ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు రూ.3కోట్లను ప్రభుత్వం నుంచి వారికి ఇప్పించడం ఒక ఉదాహరణ. దాని వల్ల వారికి పెండింగ్ బకాయిలు అందడమే కాక దాదాపు 56 మందికి ప్రతినెలా పింఛన్ కూడా ప్రస్తుతం అందుతోంది. ఇక జిల్లా ఉమ్మడి అంశాలైన వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు డెయిరీ, సహకార సంస్థల్లో జరిగిన అవినీతిపై విచారణ, వివిధ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి, నామినేటెడ్ పదవుల కేటాయింపు ఇలా అనేక అంశాల మంత్రిగా డాక్టర్ స్వామి చూపిన చొరవ అందరి ప్రశంసలు అందుకుంది. మరోవైపు నిజాయితీ, నిబద్ధతతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేసే అధికారులను ప్రోత్సహించారు.

రోడ్లు.. నీళ్లు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన పంటలు కాగా కనీసం రెండు తడులు నీరిస్తేనే అవి గట్టెక్కే పరిస్థితి. దీన్ని గుర్తించిన డాక్టర్ స్వామి ఎగువ ప్రాంతంలో ఉన్న సాగర్ కాలువ, వెలిగొండ జలాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో రామతీర్థం ప్రాజెక్టు ఎగువ భాగంలోని వెలుగువారిపాలెం సమీపం నుంచి ఏటా సుమారు 0.60 టీఎంసీల నీటిని ముసి నదికి వదిలేలా జలవనరుల శాఖ నుంచి ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు తెచ్చారు. దీంతో ముసి ద్వారా కొండపి నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు మండలాల్లోని గ్రామాలకు అవసరమైన సమయంలో సాగర్ నీరు అందనుంది.





రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి ప్రాధాన్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన అభివృద్ధి అంశమైన రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంపైనా మంత్రి స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. సుమారు రూ.92.14 కోట్ల నిధులను పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో వివిధ గ్రాంట్ల ద్వారా రోడ్లు, వంతెలనకు మంజూరు చేయించారు. అందులో కొన్ని ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ప్రధానంగా నియోజకవర్గంలో అంతర్భాగమైన పొన్నలూరు మండలం అంతా పాలేరు నదికి దక్షిణం వైపు ఉండగా ఆ మండలం నుంచి కొండపికి లేదా జిల్లాకేంద్రమైన ఒంగోలుకు రావాలంటే కందుకూరు మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాలేరు నదిపై పొన్నలూరు మండలం ముప్పాళ్ళ-జరుగుమల్లి మండలం పైడిపాడు గ్రామాల మధ్య రూ.27.83 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పీఎంజీఎస్‌వై కింద నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఇది టెండర్ల దశలో ఉంది.

- పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో పొన్నలూరు మండలం చెరుకూరు నుంచి చౌటపాలెం వరకు రూ.3.45 కోట్లతో, మండల కేంద్రమైన మర్రిపూడి నుంచి యానాదిపాలెం వరకు రూ.8.50 కోట్లతో, టంగుటూరు మండలం వెలగపూడి నుంచి అనంతవరం మీదుగా ఆలకూరపాడు వరకు రూ.4.05 కోట్లతో చేపట్టిన రోడ్ల పనులు పూర్తయ్యాయి.
- కందుకూరు నుంచి పొన్నలూరు మండలం కె.అగ్రహారం వరకు రూ.4.31కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పురోగతిలో ఉంది. మరో రూ.3.10 కోట్లతో వివిధ గ్రామాల్లో, దళితవాడల్లో ఉపాధి పథకం నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైన్లు ఇతర పనులు పూర్తయ్యాయి.
- ఆధ్యాత్మిక కేంద్రమైన మర్రిపూడి మండలంలోని పృథులగిరి కొండపైకి రూ 4కోట్ల డీఎంఎఫ్ నిధులతో మంజూరు చేసిన రోడ్డు నిర్మాణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.
- ఆర్‌అండ్‌బీ పరిధిలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పటిష్టత, విస్తరణ కోసం సుమారు రూ.13.31 కోట్లు మంజూరయ్యాయి. అందులో వారం క్రితం టంగుటూరు-పొదిలి రోడ్డుకు రూ.5 కోట్లు, ఊళ్లపాలెం రోడ్డుకు రూ.కోటి ఉన్నాయి. అక్టోబరులోనే సింగరాయకొండ పట్టణ పరిధిలో రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు, వావిలేటిపాడు - కామేపల్లి - కొండపి రోడ్డుకు రూ.3.50 కోట్లు, కె ఉప్పలపాడు-ఎం.నిడమానూరు రోడ్డుకు రూ.2.50 కోట్లు, మంత్రి స్వగ్రామమైన నాడుపాలెంకు రూ.3కోట్లు, కందుకూరు-వెన్నూరు రోడ్డుకు రూ.3.30 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.6.90 కోట్లతో పలురోడ్ల మరమ్మతులు సాగుతున్నాయి.





కొండపిలో రోడ్లకు మహర్దశ

మంత్రి స్వామి కృషితో మారుతున్న రూపురేఖలు

సిమెంటు, తారురోడ్లుగా అభివృద్ధి



వెన్నూరు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి (ఫైల్)

కొండపి, డిసెంబరు3 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో కొండపి నియోజకవర్గంలోని రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. సీసీ, తారురోడ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.కోట్లతో మరమ్మతులు జరుగుతున్నాయి. లింక్‌రోడ్లు కూడా రాకపోకలకు అనువుగా మారుతున్నాయి. టంగుటూరు మండలం వెలగపూడి నుంచి ఆలకూరపాడు వరకు రూ.4.05 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. టంగుటూరు నుంచి పాకల వరకు తారు రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నిధులు రూ.5.60 కోట్లను మంత్రి స్వామి మంజూరు చేయించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించి కొండపి నుంచి నెన్నూరుపాడు, మూగచింతల, గుర్రప్పడియ గ్రామాల్లో సీసీరోడ్డు, మిగతాది అభివృద్ధి చేసే పనులు రూ.2.90కోట్లతో ముమ్మరంగా సాగుతున్నాయి. నాయుడుపాలెం-ఓఎన్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు రూ.3.35కోట్లతో జరుగుతున్నాయి. వెన్నూరు నుంచి కందుకూరు వెళ్లే రోడ్డు అభివృద్ధికి రూ.3.30కోట్లు మంజూరయ్యాయి. వావిలేటిపాడు అడ్డరోడ్డు నుంచి కామేపల్లి మీదుగా కొండపి వరకు రోడ్డు అభివృద్ధికి రూ.3.50కోట్లు మంజూరయ్యాయి. నాయుడుపాలెం- ఓఎన్ రోడ్డు, కె. ఉప్పలపాడు నుంచి నిడమలూరు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.2.50కోట్లు మంజూరై టెండర్ల దశలో ఉంది. నాయుడుపాలెం నుంచి ఓఎన్‌రోడ్డులో మరో భాగం అభివృద్ధికి రూ. 3 కోట్లు, టంగుటూరు - పొదిలి రోడ్డులో మరమ్మతులు అవసరమైన చోట చేసేందుకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

పొన్నలూరు అభివృద్ధిలో మంత్రి స్వామి మార్క్

పొన్నలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొన్నలూరు ప్రగతిలో పరుగులు పెడుతోంది. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడాదిన్నరలోనే రూ.2.70 కోట్లతో మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఉపాధి హామీ పథకం, రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి నిధులతో పొన్నలూరులో రూ.45 లక్షలు, విప్పగుంటలో రూ.20 లక్షలు, చౌటపాలెంలో రూ.25 లక్షలు, చెరుకూరులో రూ.15 లక్షలు, బాలిరెడ్డిపాలెంలో రూ.15 లక్షలు, వెంకుపాలెంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. చౌటపాలెం నుంచి మాలపాడు, తిమ్మపాలెం మీదుగా కె.అగ్రహారం వరకు 8 కిలో మీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మించారు. దానికి అనుసంధానంగా రూ.70 లక్షలతో సీసీ రోడ్లు కూడా నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. చౌటపాలెం గ్రామంలో అండర్ డ్రైనేజీ, రావులకొల్లు ఎస్సీ కాలనీలో వాటర్ షెడ్ నిర్మాణ పనులకు రూ.30 లక్షలు మంజూరు కాగా నిర్మాణంలో ఉన్నాయి.














పృథులగిరి దేవాలయం వ్యూ

పృథులగిరి ప్రగతికి పట్టాభిషేకం

- మంత్రి స్వామి చొరవతో రూ.కోట్ల నిధులు
- ఘాట్‌రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

మర్రిపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మహర్దశ పట్టింది. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కృషి చేస్తున్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే కొండపైన రూ.50లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో దారీడొంక లేకుండా ఎగుడుదిగుడుగా ఉండే కొండ పైభాగం ప్రయాణికుల రాకపోకలకు అనువుగా మారింది. పృథులగిరి నూతన శోభను సంతరించుకుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా దేవాలయ అభివృద్ధి కోసం రూ.25లక్షలను స్వామి మంజూరు చేయించారు. ఆనిధులతో ఆలయాన్ని ఆధునికీకరించడంతోపాటు ప్రాంగణం మొత్తం ప్రహరీ నిర్మించారు. భక్తులు కొండపైకి వచ్చేందుకు ఘాట్‌రోడ్డు నిర్మించాలని ఎన్నోఏళ్లుగా కోరుతున్నారు. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న స్వామి రూ.4కోట్ల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. అత్యంత క్లిష్టమైన అటవీ అనుమతులు కూడా సాధించి ఘాట్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం చేశారు. అంతేకాకుండా నరసింహాలు వాగువద్ద నుంచి కొండమెట్ల వరకు నిలిచిపోయిన తారురోడ్డు పనులకు అవసరమైన అటవీ అనుమతులను సాధించి నిర్మాణాన్ని పూర్తి చేయించగలిగారు. మర్రిపూడి నుంచి కొండ వరకు 5కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తవడంతో భక్తులకు రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి.



ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు

పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.2.50కోట్లు సీజీఎఫ్ నుంచి మంజూరు చేయించారు. ఆమేరకు దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. దేవాలయ పునర్‌నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రిస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొండపైన త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు మర్రిపూడి విద్యుత్ ఉపకేంద్రం నుంచి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయించారు. దీంతో కొండపైన విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. మొత్తం మీద రాష్ట్రమంత్రి స్వామి చొరవతో పృథులగిరి రూపురేఖలు మారిపోతున్నాయి. అటు ఆధ్యాత్మిక కేంద్రంగా, ఇటు పర్యాటక కేంద్రంగా భాసిల్లే అవకాశాలు మెరుగయ్యాయి. వచ్చే బ్రహ్మోత్సవాల లోపు ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చూయించేందుకు నిత్యం అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేస్తూ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు.


కొండపై రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన సిమెంట్‌రోడ్డు











అందరివాడు..

జిల్లాలో నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ ప్రజలకు దూరం కాకుండా వారి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు లోటు రాకుండా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ముందుకు సాగుతున్నారు. ఎక్కడా అణువంతైనా ఆరోపణలు గానీ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో సమన్వయం లోపం ఉన్నట్లు విమర్శలు కానీ ఎదుర్కోలేదు. మంత్రిగా రాష్ట్రస్థాయిలో ఎన్ని బాధ్యతలు ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధి, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం విషయంలో ఎక్కడా వెలితి రానివ్వకుండా అందరివాడిలా పేరు సంపాదించుకున్నారు.




ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి (ఫైల్)


కనిగిరిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్వామి (ఫైల్)




















జన్మదిన శుభాకాంక్షలు
సేవాతత్పరుడు, మృధుస్వభావి,
సౌమ్యులు, పేదల పక్షపాతి,
కొండపి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత
సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి
డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
వారు మరెన్నో జన్మదిన వేడుకలు
జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ...
డా॥ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ దామచర్ల సత్యనారాయణ(సత్య) గారు
ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్
పోకూరి రవీంద్రబాబు
టీడీపీ మండల అధ్యక్షులు
జరుగుమల్లి మండలం
పోటు శ్రీనివాస మురళిబాబు (పెదబాబు)
తెలుగు రైతు పార్లమెంట్ ఉపాధ్యక్షులు,
కామేపల్లి, జరుగుమల్లి (మం)
ఏలూరి రాంబాబు
మాజీ సర్పంచ్
కామేపల్లి, జరుగుమల్లి (మం)
గాలి సందీప్
సర్పంచ్, వర్ధినేనివారిపాలెం
జరుగుమల్లి మండలం
పేముల విజయనిర్మల
రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్,
పైడిపాడు, జరుగుమల్లి (మం)
నలమోతు వెంకటేశ్వర్లు
జరుగుమల్లి PACS చైర్‌పర్సన్,
చింతలపాలెం
గుండపనేని వెంకటేశ్వరరావు(జీవీ)
చిర్రికూరపాడు PACS చైర్‌పర్సన్,
జరుగుమల్లి (మం)
తాటికొండ భీమయ్య
పచ్చవ PACS చైర్‌పర్సన్,
జరుగుమల్లి (మం)
నరాల సోమయ్య
టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి
వావిలేటిపాడు, జరుగుమల్లి (మం)
నలదల రామారావు
టీడీపీ నాయకులు
చిర్రికూరపాడు, జరుగుమల్లి (మం)
వట్టిగుంట శివాజీ
టీడీపీ నాయకులు
కె.బిట్రగుంట, జరుగుమల్లి (మం)
కొమ్మాలపాటి ప్రవీణ్
టీడీపీ నాయకులు
నందనవనం, జరుగుమల్లి (మం)
చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు
టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు
పచ్చవ, జరుగుమల్లి (మం)
కోనూరి సుబ్బారావు
టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు
నందనవనం, జరుగుమల్లి (మం)
చదలవాడ బ్రహ్మేంద్రం
టీడీపీ నాయకులు, దావగూడూరు
జరుగుమల్లి (మం)
బత్తిన బ్రహ్మయ్య
టీడీపీ నాయకులు,
దావగూడూరు, జరుగుమల్లి (మం)
బండ్లమూడి నరసింహారావు
టీడీపీ నాయకులు
దావగూడూరు, జరుగుమల్లి (మం)
కొర్రిమిల్ల శ్రీనివాసరావు
టీడీపీ మండల ఉపాధ్యక్షులు
దావగూడూరు, జరుగుమల్లి (మం)
దామచర్ల వెంకటసుబ్బయ్య
టీడీపీ నాయకులు
దావగూడూరు, జరుగుమల్లి (మం)
దామచర్ల శ్రీనివాసరావు
టీడీపీ గ్రామ అధ్యక్షులు
దావగూడూరు, జరుగుమల్లి (మం)
పోతినేని అనిల్
టీడీపీ నాయకులు
దావగూడూరు, జరుగుమల్లి (మం)
పాతూరి శ్రీహరిబాబు
టీడీపీ గ్రామ అధ్యక్షులు
నర్సింగోలు
ఇట్టె సుబ్బారావు
టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు
రెడ్డిపాలెం, జరుగుమల్లి (మం)
వర్ధినేని కామాక్షయ్య
టీడీపీ సీనియర్ నాయకులు
ఎన్.ఎన్.కండ్రిగ, జరుగుమల్లి (మం)
వర్ధినేని శ్రీనివాసరావు
టీడీపీ గ్రామ అధ్యక్షులు
ఎన్.ఎన్.కండ్రిగ, జరుగుమల్లి (మం)
పావులూరి సుధాకర్
టీడీపీ నాయకులు
ఎన్.ఎన్.కండ్రిగ, జరుగుమల్లి (మం)
తోకల వెంకటేశ్వర్లు
టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు
తూమాడు, జరుగుమల్లి (మం)
రావిపాటి శేషయ్య
టీడీపీ నాయకులు
అక్కచెరువుపాలెం, జరుగుమల్లి (మం)
పాలడుగు శ్రీనివాసరావు
టీడీపీ గ్రామ అధ్యక్షులు
చిర్రికూరపాడు, జరుగుమల్లి(మం)
స్వర్ణ సురేష్
టీడీపీ నాయకులు
నందనవనం, జరుగుమల్లి(మం)
నవులూరి పూర్ణశేఖర్‌రావు
టీడీపీ నాయకులు
వావిలేటిపాడు
రావులపల్లి రామకోటయ్య
జరుగుమల్లి PACS మెంబర్
వావిలేటిపాడు
తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జరుగుమల్లి మండలం

శనగ పంటను పీకేసిన వారిపై ఫిర్యాదు


కాకర్లలో పీకేసిన శనగ పంట

కంభం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తాను వేసిన శనగ పంటను దౌర్జన్యంగా పీకేసిన వారిపై, అలాగే మరోచోట తమ పొలంను దౌర్జన్యంగా ఆక్రమించుకొని పంటను వేస్తున్న మరో వ్యక్తిపై కంభంకు చెందిన చెరుకుపల్లి శివశంకర్ అనే విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అర్ధవీడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధిత రైతు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ శంకర్ అర్ధవీడు మండలం కాకర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 198వ సర్వే నెంబరులో 94సెంట్ల భూమిలో శనగ పంట వేయగా నాలుగువరం గ్రామానికి చెందిన వెంకటయ్య మరో 5మందితో కలిసి మంగళవారం సాయంత్రం పంట మొత్తాన్ని పీకి కుప్పలుగా పడేశారని తెలిపారు. అలాగే తన మరో భూమి సర్వే నెంబరు 197లో 56సెంట్ల భూమి కాకర్ల పరిధిలోనే ఉందని, దానిని నరాల పిచ్చిరంగారెడ్డి నా భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి శనగ పంట వేస్తున్నారని తెలిపారు. భూములను దౌర్జన్యంగా ఆక్రమించిన వారిని, పంటలను నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్ధవీడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


వద్దిమడుగు గ్రామంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొనకనమిట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రుణపడి ఉండాలన్నారు. అలాగే నాగిరెడ్డిపల్లి, తువ్వపాడు, వద్దిమడుగు, వాగుమడుగు, కొత్తపల్లి, కొనకనమిట్ల, చినారికట్ల, మునగపాడు గ్రామాల్లో మొత్తం రూ.5.91 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈమె వెంట మండల టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన బాబురావు, భాషపతి, కాశిరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

గిద్దలూరు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో మానసిక వికలాంగుల పాఠశాలలో బుధవారం చిన్ని ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అద్దంకి మౌలాలి, కె.శ్రీనివాసగౌడ్, బత్తిని సుచిత్ర, ప్రసాద్, నాగేష్‌రెడ్డి సహకారంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు పంపిణీ చేసినట్లు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈదర గోపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వికసించే పువ్వులు విభిన్న ప్రతిభావంతులు

కంభం :విభిన్న ప్రతిభావంతులు వికసించే పువ్వులతో సమానమని, ప్రత్యేక అవసరాలను అందించడం ద్వారా వారి నుంచి అసాధారణ ప్రజ్ఞను ప్రతిబింబించవచ్చని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. స్థానిక బోర్డు స్కూల్ భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు.

సర్వజన వైద్యశాలలో..

మార్కాపురం రూరల్ : స్థానిక సర్వజన వైద్యశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని చిన్నారులతో కలిసి బుధవారం సూపరింటెండెంట్ రామచంద్రారావు వైద్య సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు.

ఆహారం పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మర్కాపురం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల భవిత మానసిక దివ్యాంగుల సెంటర్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బిలాల్ బిర్యాని పాయింట్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు బిర్యానీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిర్యానీ పాయింట్ నిర్వాహకులు సయ్యద్ వలీ, సయ్యద్ సికిందర్, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి ప్రజాప్రభుత్వం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


ఆముదాలపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పొదిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజును చేయడం, ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ, అనుబంధశాఖలలో ఉన్న అన్ని పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఒకే పంటను సాగుచేయకుండా పంట మార్పిడి ద్వారా ఆదాయాన్ని ఇచ్చే పంటలను రైతులు ఎన్నుకోవాలన్నారు. ప్రతి రైతు పొగాకు, కంది, వరి పంటలనే సాగు చేస్తున్నారని, అవికాకుండా రాగులు, వరిగలు, సోమలు, ఆరికలు తదితర పంటలు పండించాలని, వాటికి రాబోవు రోజుల్లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. అలాగే ఉద్యానశాఖలో సబ్సిడీపై ఇచ్చే మల్చింగ్‌షీట్, పవర్‌ట్రిల్లర్, కూరగాయల పెంపకం వంటి పలురకాల పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో డి. శ్రీనివాసరెడ్డి, దర్శి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ వేణు, ఉద్యాన శాఖ అధికారి ధనలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది, ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదిలికొండపై అపోహలు వద్దు

పొదిలి కొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం మారుతుందనే వైసీపీనాయకులు సృష్టిస్తున్న అపోహలు నమ్మవద్దని, ప్రజలను మభ్యపెట్టే వైసీపీ నాయకులు నీతులు చెబుతారాఅని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రూప్‌ఆఫ్ టెంపుల్ మారినంతమాత్రాన దేవాలయం మర్రిపూడిలోకి మారదని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పుకునే అలవాటు వైసీపీదేనని ఎద్దేవా చేశారు.

వడ్డీలేని రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


ఎర్రగొండపాలెంలో స్త్రీ నిధి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) వడ్డీలేని రుణాలతో పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పొదుపు సంఘాల వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పొదుపు సంఘాలకు స్త్రీ నిధి ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు, సబ్సిడీరుణాలు మంజూరు చేస్తుందని అన్నారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ మట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు ప్రతి మండలంలో నెలకు రూ. 2కోట్లు ఇచ్చే విధంగా సిబ్బంది పని చేయాలని అన్నారు. ఎస్సీఎస్టీ మహిళలకు వడ్డిలేని రుణాలు విరివిగా మంజూరు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, షేక్ మాబు, డీపీఎం దానం, ఏపీఎంలు, ఐదుమండలాల వీవోఏలు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

రైతులు ఆధునిక, సాంకేతిక వ్యవసాయ పద్ధతులను పాటించి ఎక్కువ దిగుబడులు సాధించాలని టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బా బు అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎర్రగొండపాలెం రైతు సేవా కేంద్రంలో పాల్గొని సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి వీక్షించారు. ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఏడీఏ వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఏవో నీరజ, మహిళా రైతులు పాల్గొన్నారు.

మర్రిపాలెం గూడేనికి దారేదీ?

వైద్యశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యంలేక అగచాట్లు

ప్రభుత్వం స్పందించాలని చెంచు గిరిజనుల వేడుకోలు


ఆటోలో వెళ్తున్న గిరిజనులు


మొంథా తుఫాన్‌కు తెగిన చప్టా

పెద్దదోర్నాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మర్రిపాలెం గిరిజన గూడేనికి వెళ్లేందుకు దారి బాగు చేయాలని గ్రామ చెంచు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.గ్రామానికి చెందిన కొందరు ఆరోగ్యం బాగాలేక బుధవారం దగ్గరలోని చింతల ప్రాథమిక వైద్యశాలకు, మండల కేంద్రం దోర్నాల వైద్య శాలలకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడ్డారు.ఎలాగోలా రోగులను గిరిజనులకు చెందిన ఆటోలో ఎక్కించు కుని వైద్యశాలకు వెళ్లి వచ్చే సరికి గగనంగా మారింది.

శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డు నుంచి 7కిలో మీటర్ల దూరంలోని మర్రిపాలెం నుంచి అత్యవసర సమయాల్లో ప్రయాణం చేయాలంటే ఏదొక వాహనాన్ని ఆశ్రయించాల్సి ఉంది. పైగా ఆడవి మార్గం కావడంతో క్రూరమృగాల సంచారం ఉంటుంది.దీంతో తప్పనిసరిగా ఆటోనో, బైకునో అంబులెన్స్ వాహనంలోనో వెళ్లాల్సి ఉంది. కానీ మొంథా తుఫాన్ వరదకు రాళ్లవాగుపై నిర్మించిన చప్టా కొట్టుకు పోయింది.వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఏ వాహనం వెళ్లడం లేదని ప్రాణాపాయ స్థితిలో మా పరిస్థితి ఏమిటని గిరిజనులు వాపోతున్నారు.ప్రభుత్వం స్పందించి త్వరితగతిన దారి బాగు చేయాలని చెంచులు కోరుతున్నారు.

ఆటలతో ఆరోగ్యం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆటలతో ఆరోగ్యం చదువుతో పాటు పాటలలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం సమకూరుతుందని ఎంఈవో రాందాస్‌నాయక్ అన్నారు. దీక్షాయూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన పాటల పోటీలను ఎంఈవో ప్రారంభించారు. అనంతరం వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్, కోకో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శార్వాని, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, మైభారత్ కోఆర్డినేటర్ సాయి సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్లు దామోదర్, జాన్వవి, శామల, రజనిష్ల పాల్గొన్నారు.

రైతన్నా మీకోసం వర్క్‌షాప్

గిద్దలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలలో బుధవారం రైతన్న మీ కోసం వర్క్‌షాపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈవర్క్‌షాపులో నూతన పద్ధతుల ద్వారా ఆర్థికంగా పురోగతి చెందే విషయంపై రైతులతో చర్చించారు. రాబోయే 3 సీజన్లకు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక తయారు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నల్లజర్ల కార్యక్రమాన్ని స్థానిక రైతులు వీక్షించారు. వ్యవసాయాధికారి విజయ భాస్కర్‌రెడ్డి, రైతు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.


రెవెన్యూ కార్యాలయం ఎదుట కందిపంటను కుప్పగా పోసి నిరసన వ్యక్తం చేస్తున్నరైతు

కంది పంటను అధికారులు దౌర్జన్యంగా కోయించారు

- కార్యాలయం ఎదుట రైతు నిరసన

కంభం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పదిరోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో కంభం రెవెన్యూ అధికారులు తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆ పంట మొత్తాన్ని కోసి పక్కన పడేశారని బాధిత రైతు, రిటైర్డ్ సైనికుడు నల్లబోతుల హరికిరణ్ కోసిన పంటతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశాడు. బాధిత రైతు హరికిరణ్ కథనం ప్రకారం తాను 20సంవత్సరాల పాటు ఆర్మీలో పని చేశానని, రిటైర్ అవ్వగా వచ్చిన డబ్బుతో తాను కందులాపురం పంచాయతీ పరిధిలో 30సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి అందులో 10సెంట్లలో షెడ్డు వేసుకుని మరో 20సెంట్లలో కంది పంట వేశానన్నారు. అయితే కంభం రెవెన్యూ అధికారులు ఎవరో చెప్పుడు మాటలు విని తన వద్దకు వచ్చి ఇది ప్రభుత్వ స్థలమని చెప్పి దౌర్జన్యంగా కంది పంట మొత్తాని కోసి కుప్పగా పడవేశారని వాపోయాడు. తాను ఆస్థలం కొనుగోలు చేసిన రిజిస్టర్ పేపర్‌లో డాక్యుమెంట్ చూపినా వినకుండా తనకు ముందస్తు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంత దౌర్జన్యం చేయడం ఏమిటని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాధిత రైతు హరికిరణ్‌ను స్టేషన్‌కు తరలించారు.

తహసీల్దార్ కిరణ్ వివరణ

ఈ విషయమై తహసీల్దార్ కిరణ్‌ను వివరణ కోరగా హరికిరణ్ ఆక్రమించుకొని పంట వేసిన 20సెంట్లలో స్థలం ప్రభుత్వ భూమి అని తెలిపారు. తాము ఆరు నెలలుగా హెచ్చరిస్తున్నా లెక్కచేయకుండా ఆక్రమించిన స్థలం చుట్టూ గోడ కట్టడంతో పాటు పంట వేశారని, అందుకే పంటను తొలగించి అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఐటీ కళాశాలలో డీప్ బోరు ఏర్పాటు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ గుర్రం శేఖర్ బుధవారం డీప్ బోరు వేయించారు. విద్యార్థుల తాగునీటి సమస్యను ఐటీఐ ప్రిన్సిపాల్ వాసుబాబు, జీసస్ మినిస్ట్రీస్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే డీప్ బోరు వేయించి తాగునీటి సమస్య తీర్చామని కోశాధికారి సునీత రుత్ పెన్సి తెలిపారు.

పంచసూత్రాలతో లాభసాటి సేద్యం

పెద్దదోర్నాల,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రకటించిన పంచసూత్రాలతో లాభసాటి సేద్యం సాధ్యమని మండల వ్యయసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు.స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు పంచసూత్రాలపై అవగాహన కల్పించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామ ప్రణాళికలను సిద్ధం చేయండి

పెద్దారవీడు , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): : గ్రామ స్థాయిలో స్థూల ఉత్పత్తిని పెంచేందుకు రైతులతో చర్చించి వారి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలని ఏవో లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని దేవరాజుగట్టు రైతు సేవా కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి రైతన్నా-మీకోసం కార్యక్రమ ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించారు. దేవరాజుగట్టుకు చెందిన ఎన్ఎస్ అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు రైతు సేవా కేంద్రాలలో పాల్గొని గ్రామ ప్రణాళికలు తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నారు. వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు అవలంబించాలి

రాచర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :పంటల సాగులో నూతన పద్ధతులు అవలంబించాలని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. రైతన్నా మీకోసంలో భాగంగా సీఎం నిర్వహించిన ప్రత్యక్షప్రసారాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఉన్న, అధిక ఆదాయం వచ్చే పంటలు వేసుకోవాలని సూచించారు. రాచర్ల పశువైద్యాధికారి డి. హరిబాబు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిచెర్ల సబ్ స్టేషన్ పరిధిలోని తాటిచర్ల, పొట్టిపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ కొత్తలైన్లు వేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆశాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కొమరోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీవో సత్యం అన్నారు. స్థానిక ఇస్లాంపేటలోని గుంత వద్ద ఉన్న మినీ ట్యాంకును కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక గ్రామ పంచాయతీలో ట్యాం కులు క్లీనింగ్ చేయించి, వాటర్ ఫిల్ చేయించిన తర్వాత క్లోరినేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో పీడీవో జనార్దన్ రెడ్డి, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో జీవించాలి

రాచర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆ త్మవిశ్వాసంతో జీవించాలని ఆకవీడు జడ్పీ పాఠశాల హెచ్ఎం ముత్తుముల విజయబాస్కర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గిద్దలూరు పట్టణానికి చెందిన భవాని మా ర్కెట్ షాపు యజమానులు బాలకోటయ్య, సురేష్ కుమార్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు బహూకరించగా బుధవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.





స్వామిత్వ సర్వేతో యాజమాన్య హక్కులు

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేతో యాజమాన్యపు హక్కులు కలుగుతాయని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని అంకాలమ్మ వీధిలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఇంటి యజమానులకు సంబంధించిన యాజమాన్య పత్రాలను పరిశీలించి క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డులు మంజూరుచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి రాగమ్మ, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, ఉమ్మడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సంజీవి, భవిత కేంద్రం ఐఆర్పీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గోపవరపువారిపల్లి భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బరామయ్య, శ్రీహరిబాబు, విజయలక్ష్మి, సుజాత, ఆర్.శ్రీను, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

కురిచేడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం ఎంపీడీవో సత్య హనుమప్రసాద్, గృహనిర్మాణ శాఖ ఏఈ మనోహర్‌లు తనిఖీ చేశారు. శుక్రవారం మెగా పేరెంట్స్ మీట్ ఉన్నందున్న ముందస్తుగా సమస్యలు తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు తనిఖీ చేస్తున్నారు. అందులోభాగంగా ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ పరిశీలించి వారితో కలసి భోజనం చేశారు. మధ్యాహ్నం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణతోపాటు భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాంనాయక్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఇనాం భూములను పరిరక్షించాలి

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మాదాయ సర్వీస్ ఇనాం భూముల పరిపక్షణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు ఆశాఖ ఈవో నరసింహబాబు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు పట్టణం, మండలంలో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి రెవెన్యూ, దేవదాయ శాఖలు సంయుక్తంగా పరిశీలించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ముండ్లమూరులో చిరుజల్లులు

ముండ్లమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం మండలంలోచిరు జల్లులు పడ్డాయి. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడకుండా పరదా పట్టలు కప్పుకొని రైతులు కాపాడుకున్నారు. మండలంలోని రెడ్డినగర్, పెదఉల్లగల్లు, పులిపాడు, బసవాపురం, శ్రీనివాసనగర్, పసుపుగల్లు గ్రామాలకు చెందిన రైతులు కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకున్నారు.

విలువ ఆధారిత పంటలను సాగుచేయాలి

» రైతులకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచన


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, పాల్గొన్న జిల్లా అధికారులు

దర్శి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు విలువ ఆధారిత పంటలను సాగుచేసుకొని లాభాలబాటలో నడవాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని సామంతపూడిలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఐదు అంశాలను రైతులకు వివరించి చైతన్యవంతులను చేస్తున్నట్టు చెప్పారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, నీటి వనరుల సంరక్షణపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్టు చెప్పారు. అందులోభాగంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకొని రైతులు లాభాలు పొందాలని సూచించారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర పొందాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు పరిశీలన

జలసురక్ష కార్యక్రమంలో వెంకటచలంపలిలోని ఓవర్‌హెడ్ ట్యాంకును జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సేఫ్ వాటర్ కార్యక్రమంలో భాగంగా అక్కడ మంచినీటి వనరులను పరిశీలించి పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాల్సి బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం తూర్పువీరాయపాలెంలోని వివాదాస్పద భూమిని పరిశీలించారు. కార్యక్రమాల్లో డీసీవో డి.శ్రీలక్ష్మి, సివిల్‌సప్లయాస్ డీఎం వరలక్ష్మి, కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, టుబాకో గ్రోయర్స్ చైర్మన్ మండవ జయంతిబాబు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, వ్యవసాయాధికారి కె.రాధ, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, ఎంపీడీవో పి.కల్పన, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ ఆధారిత పంటలను సాగుచేసి వ్యవసాయ రంగంలో పురోగతి సాధించి లాభాలు గడించాలాన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు యు.హరిబాబు, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, చుంచు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా మండలంలోని దూబగుంట గ్రామ రైతు సేవా కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతన్నా మీకోసం వర్క్‌షాప్ కార్యక్రమాన్ని టీవీ ద్వారా ఎమ్మెల్యే ఉగ్ర తిలకించారు. కార్యక్రమంలో ఏడీఏ జైనాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలించారు. జైకో నిధులతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ఆయకట్టు సాగునీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్‌లు చుంచు కొండయ్య, ఎం.నరసింహారావు, ఎం.గిడ్డయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రాజకీయాలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ మంజూరుచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఇంటి స్థలాలు, కాలనీల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం భూములను ఫ్రీహోల్డ్ చేయడంతో స్థలాలు లేక ఊరికి దూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో జగనన్న కాలనీల పేరుతో స్థలాలు మంజూరుచేయగా ఎవరూ మొగ్గు చూపలేదన్నారు. త్వరలో ప్రభుత్వం యూనిట్ విలువను రూ.4 లక్షల వరకు పెంచే ఆలోచ నలో ఉందన్నారు.

పామూరులో గతంలో మాదిరి రెండు రోజులు పాటు రిజిస్ట్రేషన్లు జరిగేవిధంగా సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు ఆకుపాటి వెంకటేష్, బొల్లా నరసింహారావు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రైల్వేలైన్ నిర్మాణంతో కందుకూరు రోడ్డు మూతపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ఎంపీపీలు షేక్ రషీద్, ఏసురత్నం, తహసీల్దార్ వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవోలు సుందరరామయ్య, షేక్ హజరత్‌ఆలీ, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

కనిగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయం వీధిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా వీధిలోని ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, చిల్లచెట్లను తొలగించారు. గ్రంథాలయం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

తాళ్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని లక్కవరం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనగోలు చేస్తున్నట్టు బుధవారం కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని బొద్దికూరపాడు రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం జరిగిన రైతన్నా మీ సేవా కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వ్యవసాయ విస్తరణాధికారి శ్రీను, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆత్మీయ సమావేశం

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5న తల్లిదండ్రులు, అధ్యాపకులతో మెగా సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రైతులకు న్యాయం చేసేది ప్రజాప్రభుత్వమే!

వెలిగండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేసేది ప్రజా ప్రభుత్వమేనని టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురం రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిల్ప మాట్లాడుతూ వివిధ కార్యక్రమాలతో ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అక్కి. శ్రీను, కార్నటి భాస్కర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అవసరం

పామూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరమని మానవత సంస్థ అధ్యక్షులు వి.వెంకటేశ్వరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మార్కోండాపురం, విరువూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వందల చొప్పున ప్రోత్సహక నగదు బహుమతి అందజేశారు.

రక్షిత మంచినీటి సరఫరా కోసం ప్రత్యేక చర్యలు

కనిగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాధరెడ్డి అన్నారు. మండలంలోని బడుగులేరు, పునుగోడు గ్రామాల్లో బుధవారం మంచినీటి సరఫరా ట్యాంకులు, పైపులు, కుళాయిలను క్లోరినేషన్ చేయించారు.

ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

దొనకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహనికి దివ్యాంగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షుడు బచ్చలకూరి కాశయ్య మాట్లాడుతూ మండలంలో అర్హులైన దివ్యాంగుల కుటుంబాలకు ఇళ్ల స్థలులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేకల ఆశీర్వాదం, మురికిపూడి మరియదాసు, కమ్మ వెంకటస్వామి, బచ్చలకూరి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవో ఏ. బుచ్చిబాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. చీరాల పట్టణంలోని సాల్మన్ సెంటర్ సచివాలయ పరిధిలో గ్రేడు - 1 పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ముండ్లమూరు మండల గ్రామ వార్డు సచివాలయాల అధికారిగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన బుచ్చిబాబు ఎంపీడీవో శ్రీదేవిని కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పనితీరుతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటామన్నారు.


దర్శి పట్టణంలోని పుట్టబజారులో తాగునీటిని పరీక్ష చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు తదితరులు

ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి

దర్శి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. జలసురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం దర్శి పట్టణంలోని పుట్టబజారులో తాగునీటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరావు, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ముండ్లమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నమంజుల అన్నారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. బుధవారం మండలంలోని వేముల రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా రైతన్నా మీ కోసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రత్నమంజుల మాట్లాడుతూ పసుపుగల్లు సొసైటీ ఆధ్వర్యంలో వేముల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ముండ్లమూరు, పసుపుగల్లు, బొప్పూడివారిపాలెం సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం.శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడు పొందుగుల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆదెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకుల శుభ్రతపై దృష్టి సారించాలి

పీసీపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నీటి ట్యాంకుల శుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. డీప్‌బోర్, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాలరెడ్డి, జీఎస్‌డబ్ల్యూ అధికారి ఎం.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.





చందలూరు వర్క్‌షాప్‌లో అన్నదాతలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

దేవాలయాలకు రూ.1.80 కోట్లు

మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పురాతనమైన దేవాలయాల అభివృద్ధికి రూ.కోటి 80 లక్షలు మంజూరుచేయించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పెద్దపల్లిలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయానికి రూ.33.33 లక్షలు, కావూరు అంకమ్మ దేవరమ్మ ఆలయానికి రూ.20 లక్షలు, ఇసుకపల్లిలోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయానికి రూ.26.67 లక్షలు, పిట్టలవానిపాలెంలోని శ్రీ కనకపుట్టలమ్మ దేవాలయానికి రూ.33.33 లక్షలు, నగరంలో పాకాలమ్మ దేవాలయానికి రూ.40 లక్షలు, నగరం మండలం సిరిపూడిలోని శ్రీసిరిపూడిఅమ్మవారి దేవాలయానికి రూ.26.67 లక్షలను దేవదాయశాఖ నుంచి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు.

ఆర్థిక విప్లవం దిశగా దివ్యాంగులు

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల స్ఫూర్తితో దివ్యాంగులు స్వయం సంఘాలను బలోపేతం చేసుకుని ఆర్థిక విప్లవం దిశగా ముందుకు సాగుతున్న తీరు అభినందనీయమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. చినగంజాం పంచాయతీ పూలవారిపాలెం గ్రామంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. స్వయం సహాయక సమూహాల తరహాలో దివ్యాంగుల కు ప్రత్యేక మద్దతు, రుణాలు, శిక్షణ, ఉపాధి అవకాశాలను మరింత విస్తృతంగా అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దివ్యాంగులు ఎదుర్కొనే సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరిం చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. మండల పరిధి లోని 350 మందికి చేతికర్రలు, నడుం బెల్ట్‌లు, వీల్‌చైర్లు, మెడ, మోకాలు బెల్టు లు, రైల్వే పాసులు, స్వయం ఉపాధి కోసం 10 మందికి రూ.20 లక్షల రుణాలను పంపిణీ చేశారు. దివ్యాంగ మండల సమాఖ్య నిర్వహణ ఖర్చుల నిమిత్తం 75,555 నగదుని పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు తండ్రి వెంకటరావు ఎమ్మెల్యే ద్వారా దివ్యాంగ మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశాంత్రమ్మకు అందజేశారు. దివ్యాంగుల స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ లవన్న, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, తహసీల్దార్ ప్రభాకరరావు, ఎంపీడీవో ధనలక్ష్మి, సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ నాయకులు అజాద్, కొండ్రగుంట శ్రీహరిబాబు, ఆసోది సుబ్బారెడ్డి, జె.సంధ్యారాణి పాల్గొన్నారు.



మహిళకు మెడ పట్టిని అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సాగుతో.. ఆదాయం, ఆరోగ్యం

- లాభసాటి సాగుకు పంచసూత్ర ప్రణాళిక
- ఉత్సాహంగా రైతన్నా-మీకోసం చర్చా వేదికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగుతో.. రైతులకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో చర్చా వేదికలను నిర్వహించింది. రైతులు ఉత్సాహంగా హాజరై సమస్యలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం వైపునకు ప్రతి రైతు మరలి, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఎరువుల వినియోగం తగ్గించాలని, సంప్రదాయ ఎరువులతో పెట్టుబడి తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు పంచ సూత్రాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో డిమండ్ ఉన్న ఉద్యాన పంటలు సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు.. కూరగాయలు, ఆకుకూరలను చర్చా వేదికల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం సూచించే విధంగా నవధాన్యాల చక్రాలను ప్రదర్శించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జె.పంగులూరు మండలం చందలూరులో జరిగిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొ ని సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధికలాభాలు పొందవచ్చని అన్నదాతలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 326 రైతు సేవా కేంద్రాల్లో సేద్యంపై వర్క్‌షాప్ నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలో జరిగిన వర్క్‌షాప్‌లో అన్నదాతలతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. చీరాల నియోజకవర్గం పాపాయపాలెంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొనగా, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వర్క్‌షాప్‌ను నిర్వహించారు



చినగంజాం మండలంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి



చీరాల నియోజకవర్గం పాపాయపాలెంలో ఎమ్మెల్యే కొండయ్య

స్క్రబ్ టైఫస్.. కలకలం



- పల్నాడు జిల్లాలో ఇద్దరు మృతి
- జీజీహెచ్‌లో చికిత్సతో కోలుకున్న మరొకరు
- పొలం పనుల్లో జాగ్రత్తగా ఉండాలన్న వైద్యాధికారులు
- బ్యాక్టీరియా గుర్తింపునకు గుంటూరు జీజీహెచ్‌లో ప్రయోగశాల
- దద్దులు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులే వ్యాధి లక్షణాలు

నరసరావుపేట, గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ జిల్లాల్లో వెలుగుచూసిన స్క్రబ్ టైఫస్ కేసులు పల్నాడులోనూ కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా, మరొకరు చికిత్సతో కోలుకున్నారు. స్క్రబ్ టైఫస్‌తో గ్రామీణులు వణికిపోతున్నారు. ప్రస్తుతం పల్నాడుతో పాటు బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ముమ్మరంగా పొలం పనులు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో స్క్రబ్ టైఫస్ జ్వరాలు వెలుగుచూస్తున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తోంది. ప్రధానంగా పొలం పనుల్లో ఉన్న సమయం లో కుట్టే పురుగుతో స్క్రబ్ టైఫస్ వ్యాధి వ్యాపిస్తున్నట్లు అర్థమవుతోంది. కాగా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన మోరబోయిన జ్యోతి (20), రాజుపాలేనికి చెందిన యాకసిరి నాగమ్మ(62) టైఫస్ లక్షణా లతో మృతి చెందగా, రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన సాలమ్మ అనే మహిళ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొంది కోలు కున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన జ్యోతి నవంబరు 1న పొలం పనులకు వెళ్లగా గుర్తు తెలియని పురుగు కుట్టింది. అప్పు డు సహ జంగా ఏదో కుట్టిందిలే అని ఆమె పట్టించుకోలేదు. కొద్ది రోజులకు జ్వరం, ఒళ్లు నొప్పులు, శ్వాస, జీర్ణకోశ సమస్యలతో ప్రైవేట్ వైద్య శాలలో చికిత్స పొందగా జ్వరం తగ్గినా వాంతులు, విరోచనలు ప్రారంభమయ్యాయి. పురుగు కుట్టిన చోట దద్దులు వచ్చి పుండు ఏర్పడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు జ్యోతిని మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె రక్తనమూనాలను పరీక్షించగా స్క్రబ్ టైఫస్ వ్యాధి పురుగు కుట్టడం వల్ల అరుదైన వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

స్క్రబ్ టైఫస్.. జంతువుల నుంచి మనుషులకు సోకే జూనోటిక్ వ్యాధి. ఓరియన్షియా సుసుగముషి అనే పేడ పురుగు బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ జ్వరం సోకుతుంది. జ్వరబాధితుల్లో శరీరంపై ఒకే ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. దీని వల్ల వ్యాధిని సులువుగా గుర్తించవచ్చు. ఈ పురుగు కుడితే రోగుల్లో శరీరంపై దద్దులు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో గుర్తించక పోతే శ్వాస సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. లక్షణాలు కనబడిన వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధిపై ఆందోళన అవసరం లేదని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, ఇంటి బయట నిద్రించకుండా ఉండాలని వైద్యులు తెలిపారు. పొలం పనులు చేసేవారు చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బరు బూట్లు ధరించాలని, ఇంటి చుట్టుపక్కల పొదలు, ఎలుకలు నివారించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

రేపు నారాకోడూరులో మెగా పీటీఎం 3.0



నారాకోడూరు పాఠశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ

చేబ్రోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5న శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0)లో భాగంగా నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ మండల అధికారులతో కలసి సందర్శించారు. పాఠశాల లో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పాల్గొంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో సభా వేదిక, విద్యార్థులు, తల్లిదండ్రులు కూర్చునే ప్రాంగణం, వాహనాల పార్కింగ్, అతిథుల రాకపోకల మార్గాలు, గ్రౌండ్‌లో శానిటేషన్, తాగునీటి సదుపాయం వంటి అంశాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమంలో.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. రాష్ట్ర నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని నారాకోడూరులో ఒక ఆదర్శంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీవో ఊహారాణి, ఈవోపీఆర్డీ రవిశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, విద్యా కమిటీ ఛైర్మన్ గోపినాథ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రెండో విడత భూసమీకరణకు శ్రీకారం

- రేపటి నుంచే గ్రామాల్లో ఎల్‌పీ యూనిట్లు

గుంటూరు, తుళ్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే భూసమీకరణ ఉత్తర్వులు వెలు వడగా బుధవారం గుంటూరు కలెక్టరేట్‌లో మంత్రి నారాయణ విధివిధానాలపై గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గత శనివారమే ల్యాండ్ పూలింగ్ యూనిట్లకు డిప్యూటీ కలెక్టర్ల నియామకం జరిగిన ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వెంటనే కార్యాలయాలు ఏర్పాటు చేసి శుక్రవారం నుంచే భూసమీకరణ ప్రక్రియ ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. 'అమ్యూజ్ మెంట్ పార్కులు, ఎకో రిసా ర్టులు, మ్యూజికల్ ఫౌంటెయిన్స్, స్నో వరల్డ్‌లతో బ్లూ, గ్రీన్ కాన్సెప్ట్‌తో ప్రతిఒక్కరిని ఆకట్టుకునేలా రాజధాని అమరావతిలో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలి పారు. రాయపూడిలోని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయం లో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

రాజధానికి భూములిచ్చి ప్లాట్లు పొందిన రైతులను వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు కేటాయించగా కేవలం 2,168 మంది మాత్రమే 7,743 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. లంక అసైన్డ్ ప్లాట్లకు సంబంధించి ఇంకా 157 మంది రైతులకు 295 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14ఎ, శ్రీ టవర్స్, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14ఎ, శ్రీ టవర్స్, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

అవీ..ఇవీ..

సెల్‌టవర్ నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ప్రజలు

చీరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గతంలోనే రెండు సెల్ టవర్లు ఉండగా, తాజాగా మరో టవర్ నిర్మాణం చేపడుతున్నారని చీరాల పుర పాలక సంఘం 2వ వార్డు పాపరాజుతోటకు చెందిన ప్రజలు కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో టవర్ నిర్మాణంపై అప్పటికే స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గతంలో రెంటింటి వలన ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మరో నిర్మాణం చేపడితే రేడియేషన్ ప్రభావంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడతారన్నారు. వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ, వెంటనే విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం


సింగరకొండపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో పారిశుధ్యం మెరుగుపరచడం ద్వారా అంటువ్యాధులు దూరమవుతాయని, విద్యార్థులు అవగాహన కలిగి ఉండి ప్రజలకు తెలియజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. మండలంలోని శింగరకొండపాలెం గ్రామంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు 3వ రోజు బుధవారం 'ఆరోగ్యం- పరిశుభ్రత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ సెక్రటరీ రవిప్రకాష్, నాగభూషణంలు విద్యార్థులకు పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు, ఉపయోగాలను తెలిపారు.. గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వీధులు శుభ్రపరచడం, మురుగు కాలువలలో బ్లీచింగ్ చల్లడం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.షర్మిలారాణి, బోటనీ అధ్యాపకులు డి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటలతో ఒత్తిడి నుంచి విముక్తి

● వేటపాలెంలో ఉపాధ్యాయుల ఆటల పోటీలు ప్రారంభం


ఉపాధ్యాయుల ఆటలు ప్రారంభిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఆటల పోటీల్లో పాల్గొనడం వలన ఒత్తిడి నుండి విముక్తితో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని ఎంఈవో వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభించారు. మెన్ ఉపాధ్యాయులకు క్రికెట్, ఉమెన్ ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలు డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో 55 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీప్తి, పోటీల కో - ఆర్డినేటర్ దేవభిక్షం పాల్గొన్నారు.

శింగరకొండలో వైభవంగా హనుమత్ వ్రతం

● ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించిన దీక్షాభక్తులు



పూజలందుకుంటున్న స్వామివారు, దీక్ష విరమిస్తున్న భక్తులు

అద్దంకి, డిసెం బరు 3 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో హను మత్‌వ్రతం పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉమ్మ డి ప్రకాశం, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి సుమారు 250 మంది హనుమత్ దీక్షా భక్తులు బుధవారం స్వామి వారికి ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించారు. ఉదయం ఆలయ ప్రదక్షిణ చేసి అనంతరం హనుమత్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. దీక్షాభక్తులు ఇరుముడులను స్వామి వారికి సమర్పించారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు హనుమత్ మండలదీక్ష పూర్తి చేసి బుధవారం ఇరుముడి సమర్పించారు. హనుమాన్ నామస్మరణ తో శింగరకొండ మార్మోగింది. దీక్షాభక్తులకు అవసరమైన పూజా ఏర్పాట్లకు బల్లికురవ మండలం కొండాయపాలేనికి చెందిన దూళిపాళ్ల రామగోవిందు సహకారం అందించారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకారరావు, ఈవో అసిస్టెంట్ కమీషనర్ మదమంచి తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్, బత్తుల చం ద్రశేఖర్, నాగమ్మ, వెంకటనారాయణమ్మ, ఆకుల కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చినగజాం : స్థానిక హనుమసాయి కుటీరంలోని షిర్డి సాయిబాబా మందిరంలో సామూహిక హనుమత్ వ్రతాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలోని ధ్యానాంజనేయస్వామిని విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు.

రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● 'రైతన్నా మీ కోసం' సభలో ఎమ్మెల్యే కొండయ్య ● చినగజాం సభలో పాల్గొన్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

పాపాయిపాలెం (చీరాల), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంలో బుధవారం నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య, యువనాయకులు గౌరీఅమర్నాథ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతలకు అండగా ప్రజా కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు. పంటల బీమా, పెట్టుబడి సాయం, నష్టపరిహారాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. అయితే సాగులో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అధికారుల నుంచి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, ఏవో సరిత, ఏఎంసీ ఛైర్మన్ జనార్ధనరావు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


ఉప్పుటూరులో రైతులతో మాట్లాడుతున్న జేసీ భావన

పర్చూరు : లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ భావన అన్నారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో రైతులు, అధికారులతో కలసి నిర్వహించిన 'రైతన్న మీ కోసం' వర్క్ షాపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకోసం పాల్గొన్న కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని ఆమె రైతులు, అధికారులతో కలసి వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నాణ్యమైన దిగుబడులను పొందాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించ వచ్చన్నారు. ఆదిశగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. తద్వారా ఆశాజనకమైన దిగుబడులతో పాటు, భూమికూడా సారవంతం అవుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి వర్క్‌షాపును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ జీ.ప్రవీణ, శాస్త్రవేత్త మురళీనాయక్, పశు సంవర్ధనశాఖ ఏడీ మాధవి, అరుణ, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, దేవాదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన దిగుబడులను పెంచుకోవాలి

మార్టూరు: ప్రకృతి వ్యవసాయంద్వారా రైతులు ఖర్చును తగ్గించుకొని, నాణ్యమైన దిగుబడులను పెంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. బుధవారం యద్దనపూడి మండలంలోని పూనూరులోని రైతుసేవాకేంద్రంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో విజయలక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కృష్ణ, పశువైద్యాధికారి శారద, పీఏసీఎస్ అధ్యక్షులు వీ.వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు ప్రభాకరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని చినగంజాం రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'రైతన్న మీ కోసం' వర్క్ షాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏవో ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. 'రైతు బలమే- రాష్ట్ర బలం' అన్న నినాదంతో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. గత ప్రభు త్వ హయాంలో లిఫ్ట్ ఇరిగేషన్లన్నీ మూతపడినట్లు తెలిపారు. కాలువలో తూటికాడ, గుర్రపు డెక్కలతో నిండి చివరి ఆయకట్టు భూములకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. అయితే నేడు పరిస్థితి మారిందన్నారు. మొంథా తుపాన్ కారణంగా కొమ్మమూరు కాలువకు వంద చోట్ల గండ్లు పడితే వాటిని ఐదు రోజులలో పూడ్చి రైతులకు నీరు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్‌లకు మరమ్మతులు చేయించి, వాటికి వంద కోట్ల రూపాయిల నిధులను కేటాయించి ఐదు సంవత్సరాలు వరకు మరమ్మతులు చేయించే బాధ్యతను ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిపారు. రూ.45 కోట్లతో లింక్ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి లవన్న, డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిలో మినీ బైపాస్ ఏర్పాటుకు సర్వే ప్రారంభం


సర్వే చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

అద్దంకి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో ఎన్‌ఎస్‌పీ కాలువ కట్టను మినీ బైపాస్ నిర్మాణానికి సర్వే చేపట్టారు. మొదటి దశలో రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. అద్దంకి మేజర్ కాలువ సుమారు 70 అడుగుల వెడల్పు ఉండడంతో ఆ వెడల్పుతో సర్వే చేస్తున్నారు. మధ్యలో ఎన్‌ఎస్‌పీ కాలువ ను ఉంచి రెండువైపులా కట్టలను సీసీ రోడ్లుగా మార్చేందుకు రూ.17 కోట్ల నిధులు అవసరమైన అంచనాలు రూపొందించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపిచడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో నిధులు మంజూరు అయ్యాయి. త్వరలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో కాలువ కట్టలను ఆక్రమించి నిర్మాణాలు చేసుకొని నివాసం ఉంటు న్న కుటుంబాలకు పునరావాసం కల్పిం చనున్నారు. ఈ క్రమంలో శింగరకొండ పాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద ఇళ్ళ స్థలాలు పంపిణీ కూడా పూర్తయ్యింది. సర్వేచేసి హద్దులు నిర్ణయిస్తున్నారు. రేణింగవరం రోడ్డు వద్ద ప్రారంభమైన సర్వే పనులు ఎస్‌టీబీఐ కాలనీ వరకు వచ్చింది. మరో రెండు, మూడు రోజులలో సర్వే మొత్తం పూర్తయ్యే అవకాశం ఉంది. టౌన్‌ప్లానింగ్ అధికారి లక్ష్మి,మున్సిపల్ సర్వేయర్ శ్రీనివాసరావు, సిబ్బంది సర్వే పనులను చేస్తున్నారు. 70 అడుగుల వెడల్పుతో హద్దులు మార్కింగ్ వేస్తుండటంతో ఆ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

మార్టూరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హీరోషోరూం సమీపంలోని టీ షాపు వద్ద సెల్‌ఫోన్లు చోరీ చేసిన ఉప్పతళ్ల అశోక్‌కుమార్ అనేవ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వద్ద 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం శేషగిరిరావు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మంగళవారం వేకువజామున రాజుపాలెం కూడలి సమీపంలో తుర్పువైపున రెస్ట్‌ఏరియావద్ద రోడ్డుపనులు చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికులు సెల్‌ఫోన్‌ను చార్జింగ్ పెట్టినిద్రిస్తున్నారు. వారి వద్ద నుంచి అశోక్ కుమార్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు 3 సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. అశోక్‌కుమార్ ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన జగ్గయ్యపేటకు చెందినవాడు. దాంతో సైట్ ఇంజనీర్ బొంతు సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, అశోక్ కుమార్‌ను అద్దంకి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీపై కేసు నమోదు

చీరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పార్కింగ్ చేసిన రెండు వాహనాల చోరీలపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక ద్విచక్ర వాహనం గత నెల 24వ తేదీన, మరొకటి మంగళవారం అపహరణకు గురయ్యాయి. ఈక్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో పోలీసులున్నారు.

చినగంజాంలో గంజాయి పట్టివేత

చినగంజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారి టీ.జంక్షన్‌లో నిషేధిత మాదక ద్రవ్యమైన గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు 216వ నెంబరు జాతీయ రహదారి టీ.జంక్షన్ వద్ద నిషేధిత మాదకద్రవ్యమైన గంజాయి కలిగి ఉన్న చిలకలూరిపేటలోని బొప్పూడి గ్రామానికి చెందిన మల్లా వెంకటేశ్వర్లు, మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీకి చెందిన మావిళ్ల రాజ్‌కుమార్‌లను అదుపులోనికి తీసుకొని, వారి ఆధీనంలో ఉన్న 93.94గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు. వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్.ఐ తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు రమాదేవి


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పంగులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేస్తున్న ప్రతి కౌలురైతుకు తగిన గుర్తింపు కార్డుతో పాటు పంటరుణాలు ఇవ్వాలని సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు ధూళిపాళ్ల రమాదేవి కోరారు. మండల కేంద్రమైన పంగులూరులో సీపీఎం మండల కమిటి సమావేశం బుధవారం ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ., భూమి కౌలుకు తీసుకుని ఆరుగాలం కష్టపడి పంట పండిస్తున్న కౌలురైతుకు ఎలాంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఈక్రాప్, పంట రుణ సౌకర్యం కల్పించకుండా భూయజమానులకు ఆ ప్రయోజనాలు అందించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకుని కౌలు రైతులకు ఉపయోగపడేలా చట్టాలు చేసి కౌలురైతులను ఆదుకోవాలన్నారు. .నెల్లూరులో సీపీఎం నేత పెంచలయ్యను గంజాయి మూకలు హత్యచేయడం దారుణమన్నారు. హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తలపనేని రామారావు, రాయిణి వినోద్‌బాబు, గుడిపాటి మల్లారెడ్డి, సుబ్బరాజు, కృష్ణకుమారి, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై అధికారుల దాడులు

● వేటపాలెంలో ఓ దుకాణంపై కేసు నమోదు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. డీటీ ఓంకార్ నిర్వహించిన ఈ దాడుల్లో వేటపాలెంలో షాపు నెంబర్ 40లో 4 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. డీలర్ కృష్ణపై 6ఏ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే చీరాల మండలం గ్రామీణ పరిధిలో మరో షాపుపై దాడులు నిర్వహించేందుకు యత్నించగా డీలర్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. పేద ప్రజలకు పారదర్శకంగా పీడీఎస్ రైస్ పంపిణీ చేయాలని ఓంకార్ సూచించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటు

మంత్రి గొట్టిపాటి రవికుమార్


రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు గృహాల మీద నిర్మించుకోవడానికి సోలార్ ప్యానళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్రంలో సాంప్రదాయ విద్యుత్ వినియోగాన్ని పెంచడం, సాధారణ విద్యుత్ వినియోగాని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలపై కూడా సోలార్ ప్యానళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. బుధవారం మండలంలో తిమ్మనపాలెం, యర్రబాలెం మధ్య రూ.1.20 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం ప్రహరిగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అద్దంకి, కొరిశపాడు మండలాలలోని పునరావాస కాలనీల సమస్యలపై అధికారులు, గ్రామస్థులతో సమీక్షించారు.

రూ.40 కోట్లతో రహదారులు

నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖలో రూ.24 కోట్ల రూపాయలతో 13 రోడ్లు నిర్మాణం చేపట్టామని, అందులో ఇప్పటికే 7 రోడ్లను ప్రారంభించుకున్నామన్నారు. 11 రోడ్లు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరై టెండర్ దశలో ఉందన్నారు. డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ వద్ద మరో 11 రోడ్లు నిర్మాణానికి రూ.23.5 కోట్లు మంజూరుకు సిద్ధంగా ఉందన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖలో నియోజకవర్గంలో రోడ్డులు గుంతలు పూడ్చడానికి రూ.10 కోట్లు, సాగర్ కాలువపై వంతెన నిర్మాణానికి 2 కోట్లతో పాటు మొత్తం రూ.35 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 29 కమ్యూనిటి హాల్ మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 7 సబ్ స్టేషన్‌ల నిర్మాణాలు చేపట్టామని, ఇందుకోసం రూ.55 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ సాధినేని ప్రసన్న కుమారి, ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్‌డీసీ శివజ్యోతి , విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, కొరిశపాడు, బల్లికురవ తహసీల్దార్‌లు జీవీ సుబ్బారెడ్డి, రవీనాయక్ యర్రబాలెం గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేయండి

● పట్టణ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే సూచన

చీరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ కమిటీలు పూర్తిచేశామని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. బుధవారం రాత్రి నియోజకవర్గ టీడీపీ క్యాంపు కార్యాలయంలో పట్టణ విస్తృతస్థాయి సమావేశం యువనాయకులు గౌరీ అమర్నాథ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలోని కొన్ని ఇబ్బందుల గురించి చర్చించారు. అయితే ప్రస్తుతం అన్నింటినీ అధిగమించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన, చిరు వ్యాపారులకు సైతం అందిస్తున్న సంక్షేమాలను వివరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా చూడాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, మహిళ అధ్యక్షురాలు నాగేంద్రమణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల స్ఫూర్తితో దివ్యాంగుల గ్రూపులు


మహిళకు మెడ పట్టిని అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) :

మహిళా సంఘాల స్ఫూర్తితో దివ్యాంగుల గ్రూపులు కూడా తమ స్వయం సంఘాలను బలోపేతం చేసుకొని ఆర్థిక విప్లవం దిశగా ముందుకు సాగు తున్న తీరు అభినందనీయమని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామంలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు సమాజంలో అత్యంత పట్టుదలతో జీవితం గెలిచే యోధులని, వారి ఆర్థిక సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పోషించే పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛన్ల పెంపు, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దివ్యాంగులకు రూ.6 వేలకు పింఛన్ పెంచినట్లు తెలిపారు. మండల పరిధిలోని 350 మందికి చేతి కర్రలు, నడుం బెల్ట్‌లు, వీల్ ఛైర్లు, మెడ, మోకాలు బెల్టులు, రైల్వే పాసులు, స్వయం ఉపాధి కోసం 10 మంది లబ్దిదారులకు రూ.20లక్షల రూపాయిల రుణాలను డీఆర్‌డీఏ పీడీ లవన్న, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. గొనసపూడి గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త విక్రం నారాయణరావు తండ్రి వెంకటరావు దివ్యాంగ మండల సమాఖ్య నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.75,555ల నగదును ఎమ్మెల్యే చేతుల మీదగా దివ్యాంగ మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశాంత్రమ్మకు అందజేశారు. . కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, తహసీల్దార్ ప్రభాకరరావు, ఎంపీడీవో ధనలక్ష్మి, సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : నియోజకవర్గంలో బుధవారం పలు పాఠశాలల్లో విభిన్న ప్రతాభావంతుల దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. చీరాల మండలం ఈపూరుపాలెం భావనాఋషిపేట ఎంపీపీ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో 2 సుధారాణి హాజరై చిన్నారులతో మాట్లాడారు. వేటపాలెం భవిత కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎంఈవోలు జేవీవీ సుబ్బయ్య, పురుషోత్తం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభాదేవీ, ధనలక్ష్మీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి సహకరించాలి

అద్దంకి: ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎంఈవో-2 కేవీ. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం హెచ్ఎం గర్నెపూడి శ్యామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.

శారీరక వైకల్యం ప్రతిభకు అడ్డం కాదు

మేదరమెట్ల : శారీరక వైకల్యం ప్రతిభకు అడ్డంకి కాదని మేదరమెట్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు టి. అంజనిదేవి అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో దివ్యాంగ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో దివ్యాంగ ఉపాధ్యాయులు ఆత్మకూరి శ్రీనివాసచారి, గొల్లపూడి రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : సమస్యలతో స్టేషన్‌ను ఆశ్రయించే దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వేటపాలెం ఎస్సై జనార్ధన్ పేర్కొన్నారు. బుధవారం స్టేషన్‌లో దివ్యాంగులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా ఏర్పాటు చేసిన ర్యాంపును వారితో కలిస ప్రారంభించారు. కార్యక్రమంలో సాలేహా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల వివక్ష తగదు

పర్చూరు : దివ్యాంగుల పట్ల వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని న్యాయ వాదులు తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సం సందర్భంగా బుధవారం మండల న్యాయ సేవాధికా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవితకేంద్రంలోని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

అద్దంకి : అద్దంకి నియోజకవర్గ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బంగ్లారోడ్డులోని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ నియోజవకర్గంలో 130 మందికి మోటర్ వెహికిల్స్ ఇ వ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.



'సోమశిల'కు నిలకడగా వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అంతగా లేకపోవడంతో సోమశిల జలాశయానికి ఆశించినరీతిలో వరద రావడం లేదు. గడిచిన నాలుగు రోజులుగా 20 వేల క్యూసెక్కుల దిగువనే ప్రవాహం కొనసాగుతోంది మంగళవారం 12,288 క్యూసెక్కులు వస్తుండగా బుధవారం సాయంత్రం 13,464 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 70.514 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు : అయ్యప్పగుడి వద్ద వాహనదారుల అవస్థలు



వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు



బుజబుజనెల్లూరులోని ఊరకుంట చెరువుకు పడిన గండి

తగ్గినట్టే తగ్గి... ముంచెత్తింది!

'దిత్వా' ప్రభావంతో రాత్రంతా భారీ వర్షం
చిగురుటాకులా వణికిన నెల్లూరు నగరం
మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరులోనూ అంతే!
తెగిన చెరువులు.. ఉప్పొంగిన వాగులు
రహదారులపైకి దూసుకొచ్చిన వరద
వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

దిత్వా తుఫాన్ ముప్పు తప్పిందిలే అనుకున్నారంతా. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా వరుణుడూ తెరపివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. చిరుజల్లులతో ప్రారంభమైన వాన మోస్తరు.. ఆ తర్వాత భారీగా కురిసింది. రాత్రి 9 గంటల నుంచి బుధవారం ఉదయం దాకా తెరపివ్వకుండా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా సరాసరి 3.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదవగా అత్యధికంగా వెంకటాచలంలో 21.4 సెం.మీ, మనుబోలులో 15.4 సెం.మీ, ముత్తుకూరులో 12 సెం.మీ, నెల్లూరు నగరంలో 9.6 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగగా, రహదారులన్నీ జలదారులుగా మారిపోయాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని చాలా ప్రాంతాలు నీట మునగడంతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. అలాగే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై వరద పోటెత్తడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. సౌత్‌మోపూరు సమీపంలో మొగళ్లపాలెం చెరువు తెగిపోయింది. కోవూరు మండలంలో సదరన్ ఛానల్‌కు గండి పడింది. ఇక భారీ వర్షాలు, వరదలతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో సాగు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నెల్లూరుపై తీవ్రప్రభావాన్ని చూపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షం తాకిడికి నెల్లూరు జలదిగ్బంధంలో చిక్కుకు పోయింది. నగర శివారు ప్రాంతం బుజబుజనెల్లూరు, తల్పగిరికాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ తదితర ప్రాంతాలు ఉడుముల వాగు ఉధృతికి నీటమునిగాయి. పైనుంచి వచ్చిన వరద నీరు ఈ ప్రాంతాలలోని రోడ్లు, ఇళ్లను చుట్టుముట్టాయి. అయ్యప్పగుడి కూడలి వద్ద వరద భారీగా చేరుకోవడంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలుకు ఇబ్బంది ఏర్పడింది. పలు వాహనాలను దారి మళ్లించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని బయటకు పంపారు. ఇదే దుస్థితి బుజబుజ నెల్లూరులోనూ ఏర్పడింది. రెవెన్యూ కాలనీ వద్ద నీటిని బయటకు పంపేందుకు యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్,



నెల్లూరు రూరల్ : సౌత్‌మోపూరులో మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని తోడుతున్న కార్మికులు

రామలింగాపురం ప్రాంతాల్లోని అండర్ బ్రిడ్జీలు నీటమునిగాయి. దీంతో ఈ మార్గాలలో కొన్ని గంటలపాటు వాహన రాకపోకలను ఆపేశారు. భారీ యంత్రాలతో ఇక్కడ నీటిని బయటకుతోటి యథాస్థితికి తీసుకువచ్చారు. గాంధీబొమ్మ, వీఆర్సీ, పొగతోట, జేమ్స్‌గార్డెన్, రామ్మూర్తినగర్, సుబేదార్‌పేట ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. ఈ ప్రాంతాల్లోని మురుగు కాలువల సామర్థ్యం సరిపోకపోవడంతో మధ్యాహ్నం వరకు సాధారణ స్థితి కనిపించలేదు. ఇక రంగనాయకులపేట, పాతమున్సిపల్ ఆఫీస్, మను ముసుద్దీన్‌నగర్, కోటమిట్ట, ఇరగాలమ్మ సంఘం, కేవీఆర్‌కూడలి వద్ద భారీగా నీరు చేరింది. ఇదే దుస్థితి మాగుంటలేఅవుట్, గోమతినగర్, రవీంద్రనగర్‌లోనూ కనిపించింది. అటు నగరానికి ఉత్తారానున్న భగత్‌సింగ్‌కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాలు నీటి ముప్పును ఎదుర్కొన్నాయి. వైఎస్‌నగర్, ఆదిత్యనగర్, జనశక్తినగర్ ప్రాంతాలు రోడ్లు కనిపించనంతగా వర్షపునీరు చేరింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలో వాహన రాకపోకలు నిలిచాయి. కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● నాయకులు, అధికారుల సాయం

నెల్లూరులో వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు అధికార పార్టీ నాయకులు, మున్సిపల్, పోలీసు యంత్రాంగం రోడ్డెక్కింది. ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తన బృందాలతో నీట మునిగిన కాలనీలు, రోడ్లు, కాలువల వద్ద పరిస్థితి పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వరద ప్రవాహాన్ని బయటకు పంపారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుజబుజనెల్లూరు, నేతాజీనగర్, కొత్తూరు, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ ప్రాంతాలలో పర్యటించారు. అధికారులతో కలిసి యంత్రాలతో కాలువల్లో పూడికతీసి నీటిని మళ్లించారు. 19 ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిన కార్పొరేషన్ అధికారులు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్దనున్న చవటమిట్ట గిరిజన కాలనీ, నాగమ్మకాలనీ, నేతాజీనగర్, రామకోటయ్యనగర్ ప్రాంతాలలోని నీట మునిగిన నివాసాలకు ఆహార పదార్థాలను అందచేశారు.

● అలాగే నెల్లూరురూరల్లోని పంట పొలాలన్నీ నీట మునగగా, నారుమళ్లు గల్లంతు అయ్యాయి. పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహన రాకపోకలను కొన్ని గంటల పాటు అధికారులు ఆపేశారు. సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట గ్రామాలలో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆయా గ్రామాలలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



నెల్లూరు : ట్రాక్టర్ మునిగి పోయింది. ఇప్పుడెలా!?



నెల్లూరు : ఉప్పొంగిన వాగు..



నీట మునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి



నెల్లూరు : ఇంటిలో నుంచి బయటకు వచ్చేదెలా!?

చెన్నై హైవేపై వరద

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి పోటెత్తిన వరదతో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి నిండిపోయింది. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్లే రహదారిపైకి వరద ఉధృతంగా చేరడంతో వాహనాలు నిలిపి వేశారు. అలాగే వెంకటాచలం సమీపంలో గూడూరు వైపు వెళ్లే జాతీయ రహదారి మీద కూడా వరద భారీగా చేరడంతో చెరువును తలపించింది. హైవేపై వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం వేకువజాము నుంచి జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. అధికారులతో కలిసి పోలీసులు అప్రమత్తమై జేసీబీ సహాయంతో నీటిని పారద్రోలే చర్యలు చేపట్టారు. ఒకే మార్గంలో వాహన రాకపోకలు నెమ్మదిగా సాగాయి. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో రెండు మార్గాల్లోనూ వాహనాలను పునరుద్ధరించారు. అలాగే కంటేపల్లి - గొలగమూడి, గూడ్లూరువారిపాళెం - తిరుమలమ్మపాళెం గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టారు. కురిచెర్లపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మోకాలి లోతు వర్షపు నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కలుజు చెక్కలను ఎత్తివేసి వరదను దిగువకు వదిలి వేశారు. అధికారులతో కలిసి టీడీపీ నేతలు, కార్యకర్తలు తమవంతు సహాయక చర్యలు చేపట్టారు.



చెముడుగుంట వద్ద హైవేపైకి చేరిన వరద



మనుబోలు : పొదలకూరు రోడ్డుపై పొట్టేళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పహారా కాస్తున్న పోలీసులు

తీరప్రాంత గ్రామాల్లో అవస్థలు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వానకు మనుబోలు మండలం వణికిపోయింది. కండలేరు వాగు పొంగడంతో మనుబోలు-గూడూరు మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే పొట్టేళ్ల కాలువ పొంగి గొట్లపాళెం వద్ద మనుబోలు-పొదలకూరు మార్గంలోకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే వెంకన్నపాళెం వద్ద వాగులు పొంగి రోడ్డుపైకి నీరుచేరి 5 తీరప్రాంత గ్రామాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఇక పొట్టేళ్ల వాగు ఇటు కొమ్మలపూడి రైల్వేబ్రిడ్జి కింద నిండుగా ప్రవహిస్తుండటంతో కొమ్మలపూడి, చెరుకుమూడి, ముద్దమూడి గ్రామాలకు వెళ్ళేందుకు దారి లేకుండా పోయింది. దారులన్నీ మూసుకుపోవడంతో బయట ప్రాంతాలకు రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడ్డారు. వందలాది ఎకరాల్లో నార్లు, నాట్లు మునిగిపోయాయి. కయ్యల్లో మోకాలి లోతు నీరు ఉండటంతో ఇక నార్లు, నాట్లు పనికిరావని అన్నదాతలు వాపోతున్నారు.

కావలిలో స్తంభించిన జనజీవనం

కావలి, (ఆంధ్రజ్యోతి) : బుధవారం ఉదయం గంటపాటు కురిసిన వర్షానికి కావలిలో జనజీవనం స్తంభించింది. ఇటీవల మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఇప్పుడు దిత్వా ప్రభావంతో కురిసిన వర్షాలకు పట్టణంలో అనేక రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రధానమైన ట్రంకు రోడ్డుతోపాటు జాతీయరహదారిగా ఉన్న కావలి-ఉదయగిరి రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడితున్నారు. ఇక వైకుంఠపురంలోని అన్నపుగుంటను వరద ముంచెత్తడంతో తూముల వద్ద పెద్ద గుంతలు పడ్డాయి. నీటి ప్రవాహంలో ఆ గుంతలు కనిపించకపోవటంతో ఆ మార్గంలో రాకపోకలను ఆపివేశారు. ఇలా పట్టణంలోని అనేక లోతట్టు ప్రాంతాలతోపాటు మద్దూరుపాడు లోని టిడ్కో గృహవాసులకు కూడా నీటి మంపు సమస్య తప్పలేదు.



కావలి : అన్నపుగుంట చాకలివీధి వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన కంప

507 హెక్టార్లలో నీటమునిగిన వరినాట్లు

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతోపాటు కాలువల్లో పొంగి పొర్లుతున్న వరద కారణంగా జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రానికి సుమారు 507 హెక్టార్లలో వరినాట్లు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాకొచ్చింది. అదేవిధంగా 116 హెక్టార్లలో వరినారు కూడా నీటిలో మునిగింది. అత్యధికంగా కావలిలో 174 హెక్టార్లలో వరినాట్లు, 49 హెక్టార్లలో వరినారు మునిగినట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు మండలంలో 124 హెక్టార్లలో వరి, 6 హెక్టార్లలో వరినారు, బుచ్చిరెడ్డిపాళెంలో 100 హెక్టార్లలో వరి, 20 హెక్టార్లలో నారు, కోవూరులో 48 హెక్టార్లలో వరి, 9 హెక్టార్లలో నారు, కొడవలూరులో 24 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారుమడి, సంగంలో 20 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారు, బోగోలులో 17 హెక్టార్లలో వరి, 12 హెక్టార్లలో నారు నీట మునిగినట్లు అంచనా వేశారు. ఈ ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో దాదాపు 439 మంది రైతులకు చెందిన 507 హెక్టార్లలో వరి నీట మునిగిందనేది వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా.



సంగం : పల్లిపాళెం పాఠశాల ఆవరణలో వర్షపునీరు



చెరువు కాదండీ... మనుబోలులోని పంట పొలాలు

నేడు డీడీవో కార్యాలయాల ప్రారంభం



నెల్లూరులోని జడ్పీ కార్యాలయ ఆవరణలో నిర్మించిన డీడీవో కార్యాలయం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిపాలనను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీడీవో) వ్యవస్థకు కార్యాలయాలు గురువారం ప్రారంభమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో 5 డివిజన్లు ఉండగా 5 కార్యాలయాలు ఏర్పాటు చేశారు. వీటిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా గురువారం ప్రారంభిస్తున్నారు. దీంతో జిల్లాలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పాలన ఇకనుంచి కొత్త కార్యాలయాల నుంచి ప్రారంభం కానుంది.



పాండురంగస్వామి ఆలయంలో సమావేశమైన టీడీపీ నాయకులు

తిరుపతి వద్దు.. నెల్లూరే ముద్దు!

- అన్నిటికీ వ్యయ ప్రయాసే!
- ఇప్పుడున్న నెల్లూరు సౌకర్యవంతం
- రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కలువాయి వాసుల వేడుకోలు
- మార్పుపై టీడీపీ నాయకుల ఆగ్రహం
- నేడు సమావేశం

8

మెగా పీటీఎం 3.0 నిర్వహణకు రూ.51.43 లక్షల మంజూరు

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0) నిర్వహణకు రూ.51,43,500 మంజూరైనట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో, డీఈఓ ఆధ్వర్యంలో జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలల బలోపేతానికి సాయం చేసిన దాతలను సన్మానించడం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ మెగా ఈవెంట్ ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని 2,608 పాఠశాలలకు రూ.51,43,500 కేటాయించామని పేర్కొన్నారు. 30 మంది పిల్లలున్న 1510 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.900, 31-100 మంది పిల్లలున్న 663 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.2,250, 101-250 మంది పిల్లలున్న 287 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.4,500, 251-1000 మంది ఉన్న 147 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.6,750, వెయ్యిమందిపైన ఉన్న పాఠశాలకు రూ.9వేల చొప్పున నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274
కోడిగుడ్ల ధర (100):	670

వర్షాలు తగ్గాయి.. వరినాట్లు మొదలయ్యాయి !

జలదంకి, డిసెంబర్3 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలో బుధవారం తుఫాను ప్రభావం లేకపోవడంతో రైతులు వరినాట్లు మొదలుపెట్టారు. వర్షాలు అధికంగా కురిస్తే పొలాలు ముంపుబారిన పడతాయని వరి నాట్లు నాలుగైదు రోజులుగా రైతులు నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం తిరిగి నాట్లు మొదలయ్యాయి. ఎక్కువ రోజులు నానితే వరినారు ముదిరిపోయి నాట్లకు వీలు లేకుండాపోతుందనే భయం రైతుల్లో నెలకొంది. వర్షం నిలిచిపోవడంతో అన్ని పంచాయతీల రైతులు చకచకా కూలీల చేత వరినాట్లు వేయించే పనిలో నిమగ్నమయ్యారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం జలదంకి-1 రైతుసేవా కేంద్రంలో జరిగిన 'రైతన్నా.. మీకోసం' ముగింపు సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదయగిరి నియోజకవర్గంలోని రైతులకు రెండువిడతల్లో ఒక్కో రైతుకు రూ.14 వేల చొప్పున మొత్తం రూ.30 కోట్లు అందించామని ఏడీఏ శేషగిరిరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతీ రైతుకు ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందించే బాధ్యత వ్యవసాయశాఖాధికారులదేనన్నారు. మండలంలో యూరియా పంపిణీ వివరాలను ఏడీఏతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యనాయుడును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కొత్తపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం, గోపన్నపాలెం గ్రామాలకు ఇంతవరకు యూరియా ఎందుకు సరఫరా కాలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఏఓ శ్రీవాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మదుమోహన్‌రెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రా రెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు బాస్కర్‌రెడ్డి, జలదంకి సొసైటీ అధ్యక్షుడు అప్పలయ్యనాయుడు, కూటమి నేతలు చేవూరి జనార్దన్‌రెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య పాల్గొన్నారు.

వృద్ధురాలిపై చేయి చేసుకున్న పోలీసులు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న బుజ్జమ్మ

కావలి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విటులను పంపే మహిళగా వృద్ధురాలిని అనుమానించి, విచారణ నిమిత్తం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ ఆమెపై పోలీసులు చేయి చేసుకున్న సంఘటన బుధవారం కావలి పట్టణంలో వెలుగుచూసింది. బాధితురాలి, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... కావలి మండలం తాళ్లపాలెం పంచాయతీ కోటడవికి చెందిన గోళ్ల బుజ్జమ్మ, చిన నరసయ్య దంపతులు రెండు సంవత్సరాలుగా కొడవలూరు మండలం రాజుపాలెంలో ఉండే కుమార్తె హరితమ్మ ప్రభుత్వ ఉద్యోగి కావటంతో ఆమె పిల్లలను చూసుకుంటూ ఇంటి వద్ద ఉంటారు. ప్రతి నెల దంపతులు ఇద్దరు కోటడవికి వచ్చి పెన్షన్ తీసుకుని వెళ్తుంటారు. ఈ క్రమం లో ఈ నెల 1వ తేదీన పెన్షన్ కోసం గ్రామానికి వచ్చిన దంపతులు పెన్షన్ తీసుకుని 2వ తేది రాజుపాలెం వెళ్లేందుకు కావలి ఆర్టీసీ డిపోకు వచ్చారు. రెండు రోజుల క్రితం డిపో లో ఒక మహిళ మీకు అమ్మాయిలు కావాలంటే నా వద్ద ఉన్నారని కొత్తసత్రంకు చెందిన ఒక యువకుడి నుండి రూ. 5000 నగదు తీసుకుని ఉడాయించింది. అతడి ఫిర్యాదు తో పోలీసులకు డిపోలో లభించిన సీసీ ఫుటేజ్ ఆధారంగా నగదు తీసుకున్న మహిళగా అనుమానించి పొరపడిన పోలీసులు నీపై కేసు ఉంది, స్టేషన్‌కు రావాలని ఆమె భర్తను డిపోలో ఉంచి వృద్ధురాలిని పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు. అక్కడ విచారణ లో భాగంగా వృద్ధురాలిపై పోలీసులు చేయి చేసుకోగా, విషయం తెలుసుకున్న గ్రామ నాయకుడు అక్కడికి వచ్చారు. వారు అలాంటి వారు కాదని, మీరు చెప్పినప్పుడు విచారణకు తీసుకువస్తామని ఆమెను పంపించారు. డిపోకు వెళ్లిన వృద్ధురాలు భర్తతో కలసి రాజుపాలెం వెళ్లి జరిగిన సంఘటన కుమార్తెకు, బంధువులకు చెప్పటంతో వారు కావలి చేరుకుని దవడకు గాయం కావటంతో ఏరియా వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకున్న రెండవ పట్టణ సీఐ గిరిబాబు, 1వ పట్టణ ఎస్ఐ సుమన్ అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు డీఎస్పీ శ్రీధర్ ను కలిసి విన్నవించుకోగా ఫిర్యాదితో పాటు చేయి చేసుకున్న పోలీసులను పిలిపించి విచారించాలని 6వ తేదీ వచ్చి కలవాలని వృద్ధురాలి కుటుంబ సభ్యులకు డీఎస్పీ చెప్పి పంపించారు.

నీట మునిగిన వరి నారుమడులు



బిట్రగుంటలో నీట మునిగిన వరిమడులు

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో దిత్వా తుఫాన్ వల్ల నారుమడులు నీట మునిగాయి. ముందస్తుగా నార్లుపోసుకుని నాట్లు వేసుకుంటున్న రైతులకు దిత్వా తుఫాన్ శాపంగా మారింది. బిట్రగుంట, నాగులవరం, ముంగమూరు, ఏనుగులబావి, ఎస్సీపాలెం తదితర పంచాయతీలో నారుమడులు పూర్తిగా నీట మునిగి, చెరువులను తలపిస్తున్నాయి. కడనూతల చెరువు కలుజులు పారుతుండటంతో పోసిన నారుమడులు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బిట్రగుంటలో 5 వందల ఎకరాలు, ముంగమూరులో 3 వందల ఎకరాలు, నాగులవరంలో 6 వందలకు పైగా వరి మడులు నీట మునిగి రైతులు అవస్థలు పడుతున్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



విజేతలకు బహుమతులు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి (టౌన్) డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం బుధవారం కావలి పట్టణంలో ఘనంగా జరిగింది. మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొని విభిన్న ప్రతిభావంతులచే కేక్ కట్ చేయించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రూ, 10,65,000 చెక్కును అందించి విభిన్న ప్రతిభావంతురాలైన మెప్మా సిబ్బంది సునీతను సత్కరించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఫణికుమార్, టీడీపీ నాయకులు జ్యోతి బాబురావు, మెప్మా సిబ్బంది భారతి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలోని భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య పాల్గొని చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు నాగమణి, భవిత సెంటర్ ఉపాధ్యాయిని మంచికలపాటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ముసునూరు దివ్యాంగుల కాలనీలో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు, న్యాయవాది ఐ సాయిప్రసాద్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నేత చంద్రప్ప దంపతులకు సన్మానం



డాక్టర్ చంద్రప్ప దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

కావలి (టౌన్) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప దంపతులను బుధవారం పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో కావలి నాయకులు ఆహ్వానం మేరకు పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన చంద్రప్ప దంపతులను శాలువాతో సత్కరించారు. పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, పరుసు వెంకటేశ్వర్లు, వెంకటరమణా రెడ్డి, మంద కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

కందుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దనస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది మాలధారులు ఈ వ్రతంలో పాల్గొనగా ఆలయ అర్చకులు అనంత్‌స్వామి, కిషోర్‌స్వామిలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు ప్రసాద్‌స్వామి, గడిపూడి ప్రసాద్, చైర్మన్ ఆలూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ

● వాగు పొంగితే తప్పని అవస్థలు



కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

ఉలవపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో సమస్యలతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రం ఉలవపాడుతోపాటు, పక్క గ్రామాలతో కూడా సంబంధాలు తెగిపోతాయి. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఎస్సీ కాలనీవాసులు ప్రతి చిన్న పనికి మండల కేంద్రం ఉలవపాడుకు రావాల్సి ఉంటుంది. ఆ కాలనీకిపోయే రహదారిలో వాగు చప్టా ఉంది. భారీ వర్షాలకు పైఎత్తున ఉన్న పొలాలు, కరేడు పంట కాలువకు వచ్చే వరద నీరు ఈ వాగు చప్టా మీద ప్రవహిస్తాయి. దీంతో కొల్లూరుపాడు రెండు ఎస్సీ కాలనీలకు చెందిన ప్రజలు వరద నీళ్లు తగ్గేవరకు బయట గ్రామాలకు వెళ్లే మార్గం లేదు. ఉలవపాడు జాతీయ రహదారి నుంచి కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో కనీసం వీధి దీపాలు కూడా లేవు. గత కొన్నేళ్ల నుంచి చిమ్మచీకటిలోనే బిక్కుబిక్కుమంటు పాదచారులు ఆరోడ్డున వెళుతున్నారు. రాత్రివేళ కాయాకష్టం చేసుకొని ఉలవపాడు నుంచి కొల్లూరుపాడుకు వెళ్లే పాదచారులు పొలాల మధ్య బాటలో వెళ్లాల్సి ఉంది. వీధి దీపాలు లేకపోవడంతో విషపురుగులు, పాములతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

పెద్దకొండూరులో 'రైతన్నా.. మీకోసం...'



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీహరి నారాయణ

కలిగిరి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండూరు సచివాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతుసేవా కేంద్రాలద్వారా అందిస్తోందన్నారు. పంటల సాగులో వ్యవసాయశాఖాధికారుల సలహాలను పాటించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్, మాజీ సర్పంచ్ ముక్కా హజరత్‌బాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెల్లంకి కొండపనాయుడు పాల్గొన్నారు.

● కొండాపురం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఎన్ శ్రీహరి నారాయణ ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, పంట మార్పిడి పద్ధతుల గురించి వివరించారు. పంటల సాగుకు ఎటువంటి పద్ధతులు అవలంబిస్తే రైతులకు అధిక ఆదాయాన్ని పొందుతారు అనే అంశాలపై వివరాలను రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి సురేంద్ర, దేవినేని వెంకటసుబ్బయ్య రైతులు పాల్గొన్నారు.

గుండె పోటుతో రైల్వే ఏసీ మెకానిక్ మృతి



అరసన్ మృతదేహం

కావలి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా హజరత్ నిజాముద్దీన్ నుండి మధురై వెళ్లే తమిళనాడు - సంపర్‌క్రాంతి సూపర్ ఫాస్ట్ రైల్లో ఏసీ మెకానిక్ తమిళనాడు కు చెందిన అరసన్ (46) విధులు నిర్వహిస్తూ ప్రకాశం జిల్లా శింగరాయకొండ వద్ద గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో తోటి ఉద్యోగులు, ప్రయాణీకులు గుర్తించి అరసన్‌ను కావలి రైల్వే స్టేషన్లో దింపి 108కు సమాచారమిచ్చారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● విద్యుదాఘాతంతో ఆవు..

కావలి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రాంనగర్ కొరియర్ ఆఫీస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్‌కు విద్యుత్ సరఫరా కావటంతో బుధవారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. రోడ్డుపై ఉన్న వర్షపు నీళ్లకు విద్యుత్ సరఫరా అయ్యిందని, ఆ నీటిలో కాలు పెట్టిన రూ. 80,000 విలువ చేసే ఆవు మృత్యువాత పడిందని రాంనగర్‌కు చెందిన యజమాని కొమ్మి మాల్యాద్రి వాపోయాడు. ప్రభుత్వం తనకు పరిహారం అదించాలని కోరారు.

భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్తు

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాలలో బంగారు భవిష్యత్తు లభిస్తుందని కందుకూరు ఎంఈఓ ఎం నాగకుమారశర్మ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక అభ్యుదయ పాఠశాలలోని భవితకేంద్రంలో ఐఈఆర్పీ కూనం ఉదయలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దివి కోటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ శ్రావణి, సీఆర్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

సబ్ కలెక్టరును కలిసిన సక్షమ్ కార్యకర్తలు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కందుకూరు సక్షమ్ దివ్యాంగ సేవాకేంద్రం తరపున సక్షమ్ కార్యకర్తలు, కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు సబ్ కలెక్టరు హిమవంశీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చన్నా వెంకటరామాంజనేయులు, కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించండి

ఉలవపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిశీలకులు, డైట్ సీనియర్ లెక్చరర్ విజయకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని భీమవరం మెయిన్, ఏపీపీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుపట్టీలను తనిఖీ చేశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, హెచ్‌ఎం వి రమేష్, బివి నాగమణి పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు నిత్యావసరాల అందజేత



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్ఎస్ఆర్ విద్యార్థులు

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ కళాశాల ఈఈఈ డిపార్ట్మెంట్ సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో ఎయిడ్స్ డేని పురస్కరించుకుని బుధవారం పలుచోట్ల రోగ పీడితులకు చేయూతనందించారు. ముంగమూరు జాతీయ రహదారి వద్ద ఉన్న భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎయిడ్స్ ఆదరణ కేంద్రంలోని బాధితులకు పండ్లు, బిస్కెట్లు, ప్లేట్లు, గ్లాసులతో పాటు బియ్యం, కందిపప్పు, చింతపండు తదితర వస్తువులు అందచేశారు. కావలి రూరల్ తాళ్ళపాలెంలోని రూరల్ హెల్త్ సెంటర్‌లోని అనాధ బాలబాలికలు, రోగులకు కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి చేతుల మీదుగా వితరణలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఈఈఈ హెచ్ ఓడీ డాక్టర్ వీ రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏకిరణ్ కుమార్, ఈఈఈ డిపార్ట్మెంట్ అధ్యాపకులు ఉన్నారు.

కండేవారిబీడులో ఆక్రమణల గుర్తింపు



బీడులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్ఐ రమణయ్య, ఇతర అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ ఆర్ పాలెంలో కండేవారిబీడులో ప్రభుత్వ భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్న ఆక్రమణదారులను గుర్తిస్తున్నట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం రమణయ్య తెలిపారు. ఈనెల 1న ఆంధ్రజ్యోతిలో కండేవారి బీడులో 400 ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా శీర్షికన వచ్చిన వార్తకు తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు స్పందించారు. దీంతో తహసీల్దార్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ సుబ్బారెడ్డి, సర్వేయరు వెంకటేశ్వరరెడ్డిలు బుధవారం ఉదయం కండేవారి బీడులోని ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను పరిశీలించారు. గురువారం కూడా భూముల ఆక్రమణలను పరిశీలించి ఎంతమంది సాగు చేస్తున్నది గుర్తించి, దీనిపై నివేదికను రూపొందించి తహసీల్దార్ కోటేశ్వరరావుకు అందజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

జనవరి నాటికి కందుకూరు ప్రకాశంలోకి..

● భారీ ర్యాలీ ● కూటమి నేతల చిత్రపటాలకు పాలభిషేకం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు

కందుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ చర్యల ఫలితంగా గత మూడున్నరేళ్లుగా కందుకూరు నియోజకవర్గ ప్రజలు అనేక అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వారి కష్టాలు తీరుస్తూ కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ చారిత్రక నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జనవరి కల్లా కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో అంతర్భాగమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతగా తెలుగుదేశం, ఇతర కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, డాక్టర్లు, లాయర్లు ఈ ర్యాలీలో భాగస్వాములయ్యారు. పామూరు బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరగ్గా మార్గమధ్యంలో దివంగత ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో నరేంద్రమోడీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్, ఇంటూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పూరిమెట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహ్మం, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, రాచగర్ల సుబ్బారావు, ఉన్నం వీరాస్వామి, చదలవాడ కొండయ్య, రాయపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు పొందవచ్చునని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని కొండముడుసుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులకు రైతు సేవాకేంద్రం ద్వారా ఎరువులు, పశువుల మేతను ఎమ్మెల్యే పంపిణీచేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డీడీఏ సుధాకర్‌రాజు, ఏడీ చంద్రమౌళి, కందుకూరు ఇంఛార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి, ఏఓ అబ్దుల్‌రహీం, హెచ్‌ఓ జ్యోతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చర్చి అక్రమ నిర్మాణాన్ని ఆపాలని సబ్ కలెక్టరుకి వినతి

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట ఎస్సీ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న చర్చిని తక్షణం నిలిపివేయాలని ఆ కాలనీకి చెందిన దళిత నాయకుడు పల్నాటి చెన్నయ్య బుధవారం సబ్ కలెక్టరు హిమవంశీని కలిసి ఫిర్యాదుచేశారు. సర్వేనెంబరు 93,93లలో ఉన్న 10సెంట్లు ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్మిస్తున్నారని చెన్నయ్య సబ్ కలెక్టరుకు వివరించారు. ఈ సమస్యపై తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని సబ్ కలెక్టరు హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

జలదంకి, డిసెంబర్3(ఆంధ్రజ్యోతి): జలదంకి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సీతామహాలక్ష్మిని మండల టీడీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అబినందించారు. ఈ సందర్బంగా నేతలు తహసీల్దారు దృష్టికి మండలంలో ప్రముఖంగా ఉండే పలు రెవెన్యూ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమెను కోరారు. దీనికి స్పందించిన తహసీల్దారు ప్రభుత్వం విధించిన నిభందనల మేరకు తప్పక పరిష్కరిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోమశిలప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పి.మదుమోహన్‌రెడ్డి, జలదంకి సొసైటీ అద్యక్షుడు కరియావుల అప్పలయ్యనాయుడు, నాయకులు జయచంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అల్లూరులో చిరుజల్లులు



నిండుకుండలా అల్లూరు చెరువు

అల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ అల్లూరు మండలంలో బుధవారం చిరు జల్లులు కురిశాయి. మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పనులకు ఆటంకం కలిగిందని వ్యవసాయ కూలీలు అంటున్నారు. వర్షపునీరు పొలాల్లో ప్రవహిస్తుండడంతో వరినాట్లు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. చలి కొంతమేర తగ్గుముఖం పట్టింది. దీంతో మళ్లీ ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వాగులూ వంకలు ప్రవహిస్తుండడంతో మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. తీరప్రాంతంలో సముద్రం కసురు మీద ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంటున్నారు.


యూరియా సక్రమంగా అందించాలి

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరినాట్ల వేళ రైతులకు యూరియా సక్రమంగా అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని టీడీపీ రైతు సంఘం నేత యన్నాబత్తిన వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగులవరం సొసైటీలో వ్యవసాయ అనుబంధ శాఖల వర్క్ షాప్ ఎంఏవో బిశైలజ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ దేవసేన, పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంటల మార్పిడి, డిమాండ్ ఆధారిత పంటల సాగు, నీటి వినియోగం, పంటసాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే అంశాలపై ఏడీవో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్ సుధీర్‌బాబు, టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి కోటా వెంకారెడ్డి, మండల యువతాధ్యక్షులు అనంగి ఆదిశేషయ్య, స్థానిక రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

లింగసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఐఆర్టీలు సుప్రియ, శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 కె మాల్యాద్రి, ఎంఈఓ-2 ఎంవి శివకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎస్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎం సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు ఎస్ఐగా సుబ్బారావు



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుబ్బారావు

ఉలవపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా జీ సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ, అక్రమ డీజిల్ దందా, పేకాట, కోడిపందేలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

'వాత్సల్య'కు విరాళం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మినర్వా డెవలపర్స్ సంస్థ ఎండీ, నగరంలోని మూలాపేటకు చెందిన అబ్దుల్ రెహమాన్ బుధవారం తన తల్లి ప్యారిజాన్ స్మృత్యర్థం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి రూ. 65వేలు విరాళం అందజేశారు.